# ప్రజాశక్తి

బుధవారం 7 మే 2025

8 పేజీలు







విశాఖపట్నం అనకాపల్లి


# ప్రజల స్థలాన్ని టిడిపికి ఎలా ఇస్తారు ?

◆ అనకాపల్లి కలెక్టర్ తీరు దారుణం

◆ సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం



టిడిపి కార్యాలయానికి కలెక్టర్ కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న లోకనాథం తదితరులు

**ప్రజాశక్తి - అనకాపల్లి రూరల్**

ప్రజల స్థలాలను కాపాడాల్సిన జిల్లా కలెక్టరే అధికార పార్టీకి వత్తాసు పలికితే ఎలా అని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం ప్రశ్నించారు. ప్రజల ప్రయోజనాలకు, సంక్షేమానికి కృషి చేయాల్సిన అనకాపల్లి జిల్లా కలెక్టర్ టిడిపికి స్వామి భక్తి చాటుకోవడం సిగ్గుచేటని అన్నారు. జిల్లా కేంద్రంలో టిడిపి కార్యాలయానికి రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని సంవత్సరానికి ఎకరా వెయ్యి రూపాయలకు కేటాయించడంపై మండి పడ్డారు. టిడిపి కార్యాలయానికి కొత్తూరు పంచాయతీ పరిధిలో కేటాయించిన స్థలాన్ని సిపిఎం నాయకులతో కలిసి లోకనాథం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 608/10లో ఉన్న రెండు ఎకరాల స్థలాన్ని 33 సంవత్సరాలకు లీజుకు ఇవ్వడాన్ని ఖండించారు. రూ.కోట్లలో ధర పలికే ఇక్కడి స్థలాన్ని ఏడాదికి ఎకరా కేవలం రూ.వెయ్యికి లీజుకు ఇవ్వడం శోచనీయమన్నారు. స్థలాన్ని వెనక్కి తీసుకోకపోతే ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. జిల్లా విడిపోయిన తర్వాత కలెక్టరేట్ సహా ప్రభుత్వ కార్యాలయాలకు ఇప్పటివరకూ స్థలాలే కేటాయించలేదన్నారు. జిల్లాలో ఉండే కోర్టుకు కూడా స్థలం లేదన్నారు. ఇటువంటి తరుణంలో ఒక రాజకీయ పార్టీకి ఎలా స్థలం కేటాయిస్తారని ప్రశ్నించారు. ఇప్పుడు కేటాయించిన స్థలం కూడా గత ప్రభుత్వంలో క్రీడాకారులకు ఉపయోగకరంగా తీర్చిదిద్దిన మైదానమని చెప్పారు. జిఒ నెంబర్ 340ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కలెక్టర్‌పై విచారణకు డిమాండ్ చేస్తామన్నారు. టిడిపికి ప్రజల స్థలాన్ని కాజేసేందుకు సిగ్గుండాలన్నారు.

కార్యక్రమంలో పార్టీ అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్, జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కృష్ణాపురంలో ఎంఎస్ఎంఇ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

## ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్క్

మంత్రి కొండపల్లి శ్రీనివాస్


వార్త మెయిన్‌లో..


## నేడు రామజోగయ్య శాస్త్రికి ఆత్రేయ పురస్కారం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ:** మనసుకవి ఆచార్య ఆత్రేయ 104వ జయంతి సందర్భంగా ప్రముఖ సినీ రచయిత రామజోగయ్యశాస్త్రికి బుధవారం ఆత్రేయ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్టు ఆత్రేయ స్మారక కళాపీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళీధర్ మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈ మేరకు మిగతా 2లో..

## నేర విచారణలో ఫోరెన్సిక్ ఆధారాలు కీలకం


▶ వార్త 6లో..


## జివిఎంసి కార్మికుల విజయోత్సవం


▶ వార్త 2లో..


## సిఐటియు నాయకులు అప్పలరాజు కన్నుమూత


▶ వార్త 8లో..





దీక్ష విరమిస్తున్న పిసిసి అధ్యక్షులు షర్మిల

## స్టీల్‌ప్లాంట్‌ను దెబ్బతీస్తోన్న కేంద్రం

పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల


వార్త మెయిన్‌లో..


# పహల్గాం తరహా దాడులు జరిగితే..?

◆ నేడు మాక్ డ్రిల్‌కు యంత్రాంగం సన్నద్ధం

◆ కేంద్ర హోం శాఖ ఆదేశాలతో నావికాదళం అప్రమత్తం

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

పహల్గాం తరహా దాడులు జరిగితే ఎలా ఎదుర్కోవాలన్న విషయమై అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. భారత్-పాక్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం నేపథ్యంలో విశాఖ నావికాదళం కూడా ఏవైనా దాడులు జరిగితే తిప్పికొట్టేందుకు తాను కూడా సిద్ధమంటూ మాక్ డ్రిల్ దిశగా బుధవారం అడుగులు వేస్తోంది. కేంద్ర హోం శాఖ కార్యాలయ ఆదేశాల మేరకు తూర్పునౌకాదళం విశాఖ తీరంలో ఏదో ఒక చోట మాక్ డ్రిల్ నిర్వహించాలని తలపెట్టింది. పహల్గాం తరహా దాడులు ఎప్పుడైనా, ఎక్కడైనా ముఖ్యంగా శతృదుర్భేధ్యంగా ఉన్న తూర్పు నౌకాదళం కేంద్రమైన విశాఖపైనా జరగొచ్చునన్న అంచనాతో అటువంటి విపత్కర స్థితిని ధీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. ఆ దిశగా సైన్యం, యువత, ఎన్‌సిసి, స్వచ్ఛంద సంస్థలు, ఎన్ఎస్ఎస్ వంటి ఆర్గనైజేషన్స్‌ను అప్రమత్తం చేసింది. తూర్పు నౌకాదళం చరిత్రను చూస్తే పాకిస్తాన్ యుద్ధ ముష్కరులను సముద్రంలోనే మట్టి కరిపించి వేల మందిని సరెండర్ చేసుకున్న రికార్డు 1971 పాక్‌తో జరిగిన యుద్ధంలో భారత్ లిఖించుకుందన్నది మరువరానిది.

**మూడు కేటగిరీల్లో ప్రాంతాలను ఎంపిక చేసిన కేంద్రం**

సివిల్ మాక్ డ్రిల్‌పై హోం శాఖ కార్యదర్శి కార్యాలయం మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఆ సమావేశంలో అన్ని రాష్ట్రాల సెక్రటరీలు, డిజిపిలు, ఫైర్ డిజిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏ ప్రాంతాల్లో ఎలా మాక్ డ్రిల్ నిర్వహించాలో ఉన్నతాధికారులకు కేంద్రం ఆదేశాలు జారీచేసింది. అదే సమయంలో దాడులకు అవకాశం ఉన్న మూడు జిల్లాలను మూడు కేటగిరీలుగా విభజించింది. మొదట కేటగిరీలో దేశ రాజధాని ఢిల్లీ, తారాపూర్ అణు కేంద్రం, కేటగిరీ -2లో విశాఖపట్నం, హైదరాబాద్ ప్రాంతాలున్నాయి.

**నావికాదళం సన్నద్ధత**

విశాఖలో సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించేందుకు తూర్పు నావికాదళం సిద్ధమౌతోంది. డిజాస్టర్ మేనేజ్‌మెంట్ విభాగంతో కలసి తూర్పు నౌకాదళం మాక్ డ్రిల్‌కు ఏర్పాట్లను నిశితంగా పరిశీలిస్తోంది. ప్రస్తుతం సాగర జలాల్లో సన్‌రైజ్ ఫ్లీట్‌ను నిర్వహిస్తూ పెద్ద ఎత్తున మన బలగాలను సముద్రంపై నౌకాదళం మోహరించి శతృ కదలికలపై నిఘా పెట్టింది. అరేబియా మహా సముద్రంలో తూర్పు నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్ విశాఖ, ఐఎన్ఎస్ సూరత్, ఐఎన్ఎస్ మర్ముగమ్, ఐఎన్ఎస్ కొచ్చి వంటి యుద్ధ నౌకలు పహారా కాస్తున్నాయి. ఇప్పటికే తూర్పు నౌకాదళంలో యుద్ధ నౌకలు, యుద్ధ జలాంతర్గాముల్లో పనిచేసే సిబ్బందికి సెలవులను రద్దు చేసిన సంగతి తెలిసిందే.

## మొదటి పేజీ తరువాయి..

### నేడు రామజోగయ్య శాస్త్రికి ఆత్రేయ పురస్కారం

సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. రామజోగయ్యశాస్త్రి 400 వందల చిత్రాలకు మాటలు, 1500 పాటలు రాశారన్నారు. అనంతరం ఆత్రేయ రాసిన చిత్ర గీతాలతో న్యూ రోషన్‌లాల్ ఆర్కెస్ట్రా వారి నిర్వహణలో సంగీత విభావరి కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీ మంత్రులు కిమిడి కళా వెంకటరావు, గంటా శ్రీనివాసరావు, ఉపకార్ ట్రస్ట్ డాక్టర్ కంచర్ల అచ్యుతరావు తదితరులు పాల్గొంటున్నారు. ప్రేక్షకులు పెద్ద ఎత్తున హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

### స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటాం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ రంగంలోకి పోకుండా అడ్డుకుంటామని, అందుకోసం ఎంతటి పోరాటమైనా సాగిస్తామని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గాజువాక జోన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం నాటికి 1494వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చెయ్యాలని ఈ నెల 20న జరుగుతున్న జాతీయ సమ్మెలో కార్మిక వర్గం అంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆస్తులు తాకట్టు పెడితే బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో నక్క నాగరాజు, ఎయు రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్.సూరప్పడు పాల్గొన్నారు.

### కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా 9వ రోజైన మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ప్రజ్ఞ మీడియాతో మాట్లాడుతూ

ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ కోశాధికారి సుధ, స్వాతి, జశ్వంత్, మోజెస్, గీత, రూప పాల్గొన్నారు.

### సదాశివరావు లేఅవుట్ సమస్యలను పరిష్కరిస్తాం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** మధురవాడ పరదేశిపాలెం సర్వే నెంబర్ 180లో ఉన్న డాక్టర్ సదాశివరావు లే అవుట్ సమస్యలను పరిష్కరించడానికి భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. ముఖ్యంగా లేఅవుట్‌లో స్ట్రీట్ లైట్లను తక్షణం ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సదాశివరావు లే అవుట్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్ శర్మ, పివిఎస్ఎన్ గుప్తా, కార్యవర్గ సభ్యులు టిడిపి విశాఖపట్నం జిల్లా నాయకులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, 33వ వార్డు క్లస్టర్ ఇంచార్జి తిరుమల దేవి ఆధ్వర్యంలో గంటా శ్రీనివాసరావును కలిసి ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ లేఅవుట్‌కు విఎంఆర్‌డిఎ ఎల్‌పి నెంబర్ 1/2024 ఇవ్వటం జరిగిందన్నారు. లేఅవుట్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరారు.

### కూటమి పాలన అవినీతిమయం

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం వివిధ ప్రభుత్వ స్కీములను స్కాములుగా మారుస్తోందని వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పేడాడ రమణికుమారి ఆరోపించారు. మంగళవారం మహిళా విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. డిఆర్‌ఒకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రమణి కుమారి మీడియాతో మాట్లాడుతూ కుట్టు మిషన్ ట్రైనింగ్‌కు ఒక్కొక్కరికీ రూ.7300 ప్రొఫైల్ ఖర్చయితే రూ.23 వేలకు టెండర్ పిలిచినట్టు తెలిపారు. కుట్టుమిషన్ల పంపిణీలో రూ.250 కోట్ల స్కాం జరిగిందని ఆరోపించారు. మహిళల పేరు చెప్పి కూటమి నేతలు స్కాంలకు పాల్పడుతున్నారని దుమ్మెత్తిపోశారు. కార్యక్రమంలో నాయకులు సాడే పద్మావతి, వాసుపల్లి బంగారమ్మ, శశికళ, పీలా వెంకటలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

### విశాఖలో లాడ్జిలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ:** విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో అసాంఘిక కార్యకలాపాలని నిరోధించడంలో భాగంగా సోమవారం రాత్రి 11 గంటల సమయంలో నగరంలోని జోన్ -1, జోన్ 2 పరిధిలో ఏక కాలంలో 74 లాడ్జిలు, హోటళ్లలో తనిఖీలు చేపట్టామని పోలీస్ అధికారులు తెలిపారు. తనిఖీల్లో ప్రధానంగా లాడ్జిలు, హోటళ్లలో తప్పిపోయిన వ్యక్తులు ఎవరైనా ఉన్నారా, విదేశీ అతిథులు పాస్‌పోర్టు లేకుండా ఉన్నారా? హోటల్లో వ్యభిచార కార్యకలాపాల నిర్వహణ వంటి అంశాలను తనిఖీ చేశారు. హోటళ్లకు ఎన్‌ఒసి, ట్రేడ్ లైసెన్స్, జిఎస్టి సర్టిఫికెట్లు ఉన్నాయా లేదా అన్నది విచారించారు. సిసి కెమెరాల ఫుటేజ్, విజిటింగ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. హోటళ్లు, లాడ్జీలలో బసచేసేవారు ఎవరైనా గంజాయి, ఆయుధాలు, మందుగుడు సామగ్రి, కలిగి ఉన్నారా వంటి అంశాలను తనిఖీ చేశారు.

### విద్యార్థులకు వేదాంతు శిక్షణ

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ:** ప్రముఖ విద్య శిక్షణా సంస్థ అయిన వేదాంతు తమ లెర్నింగ్ సెంటర్లను విస్తరించే క్రమంలో విశాఖపట్నం విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సంస్థ సీఈవో వంశీకష్ణ తెలిపారు. మంగళవారం సిరిపురంలోని ఒక ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వేదాంతు ఆఫ్‌లైన్ కేంద్రాల లెర్నింగ్ సెంటర్‌ను తిరుపతిలో ఏర్పాటు చేశామన్నారు.

# జివిఎంసి కార్మికుల విజయోత్సవం



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ :** జివిఎంసి పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు జివిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, సిఎంహెచ్‌ఒ పి.నరేష్ కుమార్ సమక్షంలో ఇటీవల జరిగిన చర్చలు ఫలవంతం కావడంతో కార్మికులు మంగళవారం విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి మాట్లాడారు. అధికారులతో జరిగిన చర్చల మేరకు సుమారు రెండు వేల మంది క్లాప్ డ్రైవర్లు, లోడర్లు, బదిలీ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెరగనున్నాయన్నారు. క్లాప్ డ్రైవర్ల కాంట్రాక్టర్‌తో ఈ నెల చర్చలు జరిపి జిఒ 7 ప్రకారం రూ.18500 చెల్లించేందుకు, గుంటూరు పిఎఫ్ కార్యాలయం నుంచి సమాచారం తీసుకొని బ్యాలెన్స్ పిఎఫ్ సొమ్ము ఎస్‌పిపి ద్వారా కార్మికులకు జాయినింగ్ తేదీ నుంచి మొత్తం వేతనాలపై చెల్లించేందుకు అంగీకారం కుదిరిందన్నారు. లోహియా బ్యాటరీ వాహన కాంట్రాక్ట్ డ్రైవర్ల విషయమై చర్చించిన వివరాలను ఆయన తెలియజేశారు. 2025-26 సంవత్సరానికి జూలై నుంచి కొత్త టెండర్లు పిలవడానికి లేదా ఎస్-ఎల్‌ఎఫ్ ద్వారా కార్మికులకు వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని అధికారులు అంగీకరించారని చెప్పారు. పూర్తి వేతనాలు చెల్లించేందుకు సమ్మతం తెలిపారన్నారు. అక్రమాలకు పాల్పడకుండా, బెదిరింపులు లేకుండా ఉండాలని కాంట్రాక్టర్‌కు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. క్లాప్ లోడర్లకు జిఒ 7 ప్రకారం రూ.15 వేలు ఎస్‌ఎల్‌ఎఫ్ ద్వారా వేతనాలు చెల్లించడానికి, పిఎఫ్, ఇఎస్‌ఐలను ఎస్‌ఎల్‌ఎఫ్ కోడ్ నెంబర్లపై జమ చేసేందుకు అంగీకారం కుదిరిందన్నారు. వారం రోజుల్లో వేతన బకాయిలు చెల్లించనున్నారన్నారు. ఎస్‌డిసి కాంట్రాక్టర్‌ను నిలుపుదల చేసి ఎస్-ఎల్‌ఎఫ్ ద్వారా వేతనాలు చెల్లించడానికి, నిర్ణీత తేదీకి ప్రతి నెలా వేతనాలు ఇవ్వడానికి అంగీకారం కుదిరిందన్నారు. కార్పొరేటర్ ద్వారా నియమించబడ్డ కాంట్రాక్టు కార్మికులు, బదిలీ కార్మికులకు జిఒ 7 ప్రకారం రూ.15 వేలు చెల్లించడానికి, గతంలో పారిశుధ్య కార్మికుల వలే ఎస్‌ఎల్‌ఎఫ్‌ల ద్వారా బిబి చెల్లించడానికి అంగీకరించారని చెప్పారు. అనకాపల్లి కార్మికుల ఆరు నెలల వేతనాలతో సహా మిగిలిన కార్మికుల బకాయి వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకుంటామని అంగీకరించారని తెలిపారు. కార్మికుల పోరాటం వల్లే పైవన్నీ సాధ్యమయ్యాయన్నారు. ఈ విజయాన్ని మంగళవారం ఉదయం ఆకస్మికంగా మృతిచెందిన సిఐటియు జిల్లా నాయకులు జి.అప్పలరాజుకు అంకితమిస్తున్నామన్నారు. తొలుత ఆయన మృతికి సంతాపం ప్రకటించారు. అప్పలరాజు మృతి కార్మికవర్గానికి తీరని లోటని అన్నారు. పి.అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గొలగాని అప్పారావు, ఎం.ఈశ్వరరావు, శ్రావణ్, శ్రీను, నాని, వసంత్, రమణ పాల్గొన్నారు.

# జివిఎంసి మెకానికల్ విభాగంపై మేయర్ సమీక్ష

**ప్రజాశక్తి-ఎంవిపికాలనీ:** మహా విశాఖపట్నం నగర పాలకసంస్థ మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ మెకానికల్ విభాగంపై మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మట్లాడుతూ జివిఎంసిలో ఎలక్ట్రికల్ వాహనాలతో పాటు జివిఎంసి సొంత వాహనాలు, అద్దెవాహనాలు ఎన్ని ఉన్నాయని వాటిని ఏఏ అధికారులకు కేటాయించారని మేయర్ ఇంజనీరింగ్ అధికారులను ఆరా తీశారు. నగరంలోని 8జోన్లలో వ్యర్థాలు తరలించే వాహనాలు ఎన్ని ఉన్నాయి, వాటి నిర్వహణ అలాగే జెసిబిలు, లోడర్లు , బాబ్కట్లు, క్లాప్ వాహనాలు, బీచ్ క్లీనింగ్ యంత్రాలు తదితర వాహనాలు వాటి పనితీరుపై జివిఎంసి పర్యవేక్షక ఇంజనీరు (మెకానికల్) గోవిందరావు ను అడిగి తెలుసుకున్నారు. బీచ్‌ను శుభ్రం చేసేందుకు బీచ్ క్లీనింగ్ యంత్రాలు ఎన్ని పనిచేస్తున్నాయి వాటి పనితీరును స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. జివిఎంసి వాహనాలకు సంబంధించి అనవసరపు ఖర్చులు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జివిఎంసిలో నిరుపయోగంగా ఉన్న వాహనాలను వేలం వేసేందుకు ప్రణాళికాయు తమైన చర్యలు తీసుకోవాలని ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాద్‌రాజును మేయర్ ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో నగరంలో ప్రధాన గెడ్డలు, కాలువల్లో వ్యర్థాలు, పూడికల తొలగింపు వాటి స్థితిగతులపై ఇప్పటి నుండే చర్యలు తీసుకోవాలని, గెడ్డలను స్వయంగా పరిశీలిస్తానని మేయర్ తెలిపారు.

సమీక్షలో జివిఎంసి ప్రధాన ఇంజినీరు శివప్రసాద్‌రాజు, అదనప కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ, కార్యనిర్వాహక ఇంజనీరు రత్నాకర్‌రెడ్డి, ఉపకార్యనిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌సి యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

**ఎంవిపి కాలనీ:** ఎస్‌సి కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ అండ్ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా నాక్ శిక్షణ కేంద్రం, పెదగంట్యాడ, గాజువాకలో ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్స్‌లో పిఎం అనుశ్చిత్ జాతి అభ్యుదయ యోజన పథకం కింద షెడ్యూల్డు కులానికి చెందిన యువతకు స్వల్పకాలిక నైపుణ్యాభివద్ధి ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్‌సి కార్పొరేషన్ ఈడి సత్యపద్మ, నాక్ డైరెక్టర్ రవికుమార్ మంగళవారం తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులై ఉండి18 నుంచి 40 సంవత్సరాల వయోపరిమితి గల ఎస్‌సి అభ్యర్థులు అర్హులని సీట్లు పరిమితంగా ఉన్నాయని తెలిపారు. శిక్షణ నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో ఉంటుందని, శిక్షణ కాలంలో ఉచిత మధ్యాహ్న భోజనం, స్టేషనరీ ఉచితంగా అందజేస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రభుత్వ సర్టిఫికెట్ జారీచేసి ఉపాధి కల్పిస్తామన్నారు.

# ఇళ్ల పట్టాలివ్వాలని ధర్నా

**ప్రజాశక్తి -యంత్రాంగం**

**గాజువాక :** జిఒ 30 ప్రకారం పట్టాలివ్వాలని, జిఒ 296 ప్రకారం ఇచ్చిన పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతూ గాజువాక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, జిఒ 30 ప్రకారం అన్ని కాలనీల్లో సర్వే చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నో సంవత్సరాలుగా నివాసముంటున్న స్వతంత్రనగర్ ఎస్‌టి.కాలనీ, కుంచుమాంబ కాలనీ, రామ్‌నగర్, అప్పన్నకాలనీ, సాయిరాం కాలనీలకు జిఒ 30 ప్రకారం పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

సుందరయ్య కాలనీ, దుర్గానగరం, దశమకొండ, బానోజీతోట, సింహగిరి కాలనీల్లో నివాసముంటున్న వారికి జిఒ 296 ప్రకారం ఇచ్చిన పట్టాలకు రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. ఈ ధర్నాలో సిపిఎం జోన్ నాయకులు ఎ.లోకేష్, పి.స్వామి, బి.అప్పారావు పాల్గొన్నారు.

**ములగాడ :** సిపిఎం మల్కాపురం జోన్ కమిటీ ఆధ్వర్యాన ములగాడ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి మరడాన జగ్గునాయుడు మాట్లాడుతూ, జిఒ 30 ప్రకారం 2019 అక్టోబర్ ముందు ఇల్లు నిర్మించుకొని, ఇంటి పన్ను, కరెంటు బిల్లు, రేషన్ కార్డు ఉన్నవారికి మాత్రమే ఇళ్ల పట్టాలకు అర్హులుగా ప్రభుత్వం చెబుతోందని, 2024 సంవత్సరం వరకు వర్తింపజేయాలని డిమాండ్‌చేశారు. జిఒలు 296, 388 ప్రకారం గత ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు వెంటనే రిజిస్ట్రేషన్, పేర్లు మార్చుకునే విధంగా జిఒ తేవాలని కోరారు. సిపిఎం ఆధ్వర్యంలో ఇచ్చిన దరఖాస్తులను త్వరగా విచారించి అర్హులైన వారందరికీ పట్టాల రిజిస్ట్రేషన్, పట్టాలు లేని వారికి పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం తహశీల్దార్ భుజంగరావుకు ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ కోసం చేసిన దరఖాస్తులను అందజేశారు. ఈ ధర్నాలో సిపిఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, ఎ.సత్యారావు, బూడి శ్రీను, ఎన్ శ్రీనివాసరావు, గంటా సత్యనారాయణ, కోటేశ్వరరావు, పి.సురేష్, బి.ప్రసాద్, ఎస్‌కె.సుభాని, కె.ఈశ్వరరావు, జి.నరేష్, మోహన్, ఈశ్వరరావు పాల్గొన్నారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జగ్గునాయుడు




ధర్నాలో మాట్లాడుతున్న సిపిఎం జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు

## నేరాలు ఘోరాలు

### వివాహిత ఆత్మహత్య



**ప్రజాశక్తి-ఉక్కునగరం :** దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి అగనంపూడి గల్లవానిపాలెంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. శ్రీవైష్ణవి ఆర్కేడ్ అపార్ట్‌మెంట్ టెర్రస్ పైనుంచి దూకి గుడ్ల కమల కుమారి (58) ఆత్మహత్య చేసుకుంది. ఫార్మసిటీలో పనిచేస్తున్న ఆమె భర్త గళ్ల వెంకట మురళి (60) గత నెలలోనే మృతి చెందాడు. తర్వాత స్వస్థలమైన విజయవాడ వెళ్లారు. ప్రస్తుతం గల్లావానిపాలెంలోని కుమార్తె, అల్లుడు వద్ద ఆమె ఉంటుంది. ఈనెల నాలుగో తేదీన విజయవాడ నుంచి వచ్చిన నుంచి ముభావంగా ఉంటున్న ఆమె మనస్థాపంతో మంగళవారం ఉదయం టెర్రస్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**ప్రజాశక్తి -ఆనందపురం :** మండలంలోని గంభీరం జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందారు. భోగాపురం మండలం పోలిపిల్లికి చెందిన మామిడి రామలక్ష్మి (46) మంగళవారం బోయపాలెం నారాయణ కళాశాలలో చదువుతన్న తన చెల్లి కుమార్తెను కలవడానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున క్రమంలో గంభీరం ఫ్లైఓవర్ దాటిన తర్వాత ద్విచక్ర వాహనం నుంచి పడిపోయారు. తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందారు. ఈమె భర్త గతంలోనే మృతిచెందారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### 40 కిలోల గంజాయి పట్టివేత

**ప్రజాశక్తి -కోటవురట్ల:** మండలంలో ఎండపల్లి గ్రామం వద్ద సోమవారం రాత్రి కారులో గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అలాగే స్కూటీపై గంజాయితో మరో వ్యక్తి కలిపి నలుగురిని పట్టుకున్నట్లు స్థానిక ఎస్‌ఐ రమేష్ తెలిపారు. నిందితుల నుంచి 40కిలలో గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉత్తరప్రదేశ్ కు చెందిన ముగ్గురు వ్యక్తులు, చింతపల్లి మండలానికి చెందిన మరొక వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు.

### విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి

**ప్రజాశక్తి-కశింకోట :** మండలంలోని జె.తుని పంచాయతీ నరసింగబిల్లి గ్రామానికి చెందిన చవితిని చిలకమ్మ (54) మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. ఎఎస్‌ఐ రమణమ్మ అందించిన వివరాలు ప్రకారం... చవితిని చిలకమ్మ గొబ్బురు పాలెంలో ఉన్న తమ పొలానికి మంగళవారం ఉదయం 10 గంటలకు వెళ్లింది. చెరుకు తోట తడిపేందుకు చిలుకమ్మ మోటార్ ఆన్ చేయగా, ఒక్కసారికి ఆమె విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై ఆమె కుమారుడు రమణబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్‌ఐ రమణమ్మ తెలిపారు. కాగా మృతురాలు చిలకమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## జివిఎంసి కమిషనర్‌ను నియమించాలి

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** జివిఎంసి కమిషనర్‌ను వెంటనే నియమించాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జివిఎంసి కమిషనర్ నియామకంలో తీవ్ర జాప్యం కారణంగా పాలనా యంత్రాంగంలో స్తబ్ధత నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమ పథకాలు దశల వారీగా అమలవుతున్న నేపథ్యంలో వాటిని క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లేందుకు కమిషనర్ నియామకం తక్షణ అవసరం అని చెప్పారు.

## 188 మందికి నేత్ర వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** స్థానిక సన్ స్కూల్లో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 188 మందికి నేత్ర వైద్య నిపుణులు ఆర్.కృష్ణవేణి, బి.వివేక్‌వర్మ, సిబ్బంది పరీక్షలు చేశారు. వీరిలో 45 మందికి శస్త్ర చికిత్సలు, 44 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. త్వరలో ఉచితంగా కళ్లద్దాలు అందజేయనున్నట్లు నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఎన్‌ఎల్.రావు, ఎం.సూర్యశ్రీనివాస్, వి.శ్రీనివాసరెడ్డి, ఎస్.రమణప్రసాద్, ఎ.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

## అరుదైన నరాల వ్యాధికి కేర్‌లో విజయవంతంగా చికిత్స

**ప్రజాశక్తి - ఆరిలోవ** : అరుదైన నరాల సంబంధిత వ్యాధితో పూర్తిగా నడవలేని స్థితిలో ఉన్న 35 ఏళ్ల మహిళకు విజయవంతంగా చికిత్స చేసినట్లు కేర్ ఆసుపత్రి వైద్యులు తెలిపారు. ఆరిలోవ హెల్త్‌సిటీలోని కేర్ ఆసుపత్రిలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. మహిళ రాధారాణి నరాల సంబంధిత వ్యాధితో ఆసుపత్రికి వచ్చారని తెలిపారు. ఆమెను పరీక్షించిన వైద్యులు న్యూరోమైలిటిన్ ఆప్టికా స్పెక్ట్రం డిజాస్టర్ (ఎన్‌ఎమ్‌ఒఎస్‌డి) అనే అరుదైన వ్యాధిగా గుర్తించినట్లు చెప్పారు. ఈ వ్యాధి కారణంగా ఆమె వెన్నులో తీవ్రమైన వాపు ఏర్పడి కాళ్లలో చలనం, స్పర్శ పూర్తిగా పోయాయని తెలిపారు. ముందుగా ఆమెకు మెదడు, వెన్నుకు సంబంధించి చేసిన ఎంఆర్‌ఐ స్కాన్‌లో మెడ కింద నుంచి వెన్ను వరకు వాపు గుర్తించినట్లు వివరించారు. ప్రాథమిక రక్త పరీక్షలో వ్యాధికి సంబంధించి స్పష్టమైన లక్షణాలు కనిపించకపోయినా, చికిత్సలో జాప్యం చేయకుండా ప్రత్యేక చికిత్స ప్రారంభించినట్లు తెలిపారు. మొదట ఆమెకు ఐదు రోజుల పాటు ఐవి ద్వారా మందులు అందించామని, తరువాత ప్లాస్మా ఎక్స్ఛేంజ్ అనే శరీర రక్షక వ్యవస్థను శుద్ధి చేసి చికిత్సను విడతలుగా అందించినట్లు వివరించారు. మెరుగుదల కనిపించడంతో మోనోక్లోనల్ యాంటి బాడీ ఆధారిత చికిత్సను ప్రారంభించినట్లు తెలిపారు. నెల రోజుల వ్యవధిలో రాధారాణికి కాళ్లలో బలం, స్పర్శ తిరిగి వచ్చాయని, ఆమె నడవడం ప్రారంభించి, సాధారణ జీవితం వైపు అడుగులు వేశారని వివరించారు. కేర్ ఆసుపత్రి సీనియర్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ఎంజివి.ఆదిత్య మాట్లాడుతూ లాంగిట్యూడినల్ ఎక్స్‌టెండింగ్ ట్రాన్స్‌ఫర్స్ మైలైటీస్ (ఎల్‌ఇటిఎం)తో కూడిన న్యూరోమైలిటీస్ ఆప్టికా స్పెక్ట్రం డిజార్డర్ అనేది లక్ష మందిలో ఒకరికి మాత్రమే వస్తుందన్నారు. రాధారాణి విషయంలో గమనించిన వెంటనే ఇచ్చిన ఇమ్యూనోథెరపీ వల్ల ఆమె పూర్తిగా ఆరోగ్యాన్ని తిరిగి పొందగలిగారన్నారు. ఈ చికిత్సలో సీనియర్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఎవి.వేణుగోపాల్, డాక్టర్ శ్రీనివాస్‌తో కూడిన క్రిటికల్ కేర్ బృందం కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. కోలుకున్న రాధారాణి మాట్లాడుతూ, తిరిగి నడలేను అనుకున్న తనకు వైద్యులు కొత్త జీవితాన్ని ఇచ్చారన్నారు. ఎటువంటి కేసులకైనా సరైన సమయంలో సరైన వైద్యం అందించడమే తమ లక్ష్యం అని ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మయూఖ్ చౌదరి తెలిపారు.



కోలుకున్న రోగిని అభినందిస్తున్న కేర్ ఆసుపత్రి వైద్యులు

## కెకె.రాజుకు నాగిరెడ్డి, చింతలపూడి అభినందనలు

**ప్రజాశక్తి -గాజువాక** : వైసిపి జిల్లా అధ్యక్షులుగా నియమితులైన కెకె.రాజును ఆయన ఇంట్లో గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈల్లపు రాము, ప్రగడ వేణు బాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, బోండా గోవిందరాజులు, సబ్బవరపు ఈశ్వరరావు, దాసరి అప్పుడు పాల్గొన్నారు.

**కెకె.రాజును కలిసిన నాగిరెడ్డి**

వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజును గాజువాక మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కెకె.రాజును తిప్పల నాగిరెడ్డి, వైసిపి గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, రాజాన వెంకటరావు, మహ్మద్ గౌస్, భూపతిరాజు శ్రీనివాసరాజు, పల్లా పెంటారావు, మంత్రి శంకరనారాయణ, జీలకర్ర నాగేంద్ర, చిక్కాల సత్యనారాయణ, బోని శివరామకృష్ణ పాల్గొన్నారు.



కెకె.రాజును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య

# దర్జాగా ఫుట్‌పాత్ ఆక్రమణలు

## ఇబ్బందులు పడుతున్న బాటసారులు

ప్రజాశక్తి - ఆరిలోవ : ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారులు, బాటసారుల సౌకర్యార్థం రూ.కోట్లు వెచ్చించి రోడ్డు విస్తరణ, అందమైన కాలిబాటలు వేశారు. కానీ ఏ లక్ష్యం కోసం వేసారో అవి నెరవేరటం లేదు. రహదారులు ఎంత విస్తరించినా రోడ్డుకిరువైపులా ఆక్రమణలు చోటు చేసుకోవడంతో చివరికి పాత పరిస్థితే వస్తుంది. హనుమంతువాక కూడలి నుంచి విశాలాక్షినగర్ మీదుగా కైలాసగిరి కూడలి వరకు రోడ్డు విస్తరణ కోసం ఇరువైపులా ఇంటి యజమానుల నుంచి స్థలాలు సేకరించి, వారికి నష్టపరిహారం చెల్లించి రూ.కోట్లు వెచ్చించి రన్‌వే మాదిరిగా సుమారు 60 అడుగుల రహదారిని నిర్మించారు. వాటికి ఇరువైపులా అందమైన టైల్స్‌తో కాలిబాటలు నిర్మించారు. ఈ ఫుట్‌పాత్‌లపై కమర్షియల్ బడ్డీలు ఏర్పాటు చేసుకొని దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. కాలిబాటలు పూర్తిగా కబ్జాకు గురయ్యాయి. ఇంత జరుగుతున్నా పట్టణ ప్రణాళికాధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆపార్టీ స్థానిక నాయకుల సిఫార్సులు, ఒత్తిడితో అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది. వ్యాపారుల నుంచి జివియంసి పట్టణ ప్రణాళికా సిబ్బందికి, స్థానిక రాజకీయ నాయకులకు ముడుపులు అందుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణ ప్రణాళిక అధికారులు వీటిని తొలగించే ప్రయత్నం చేసినా పై నుంచి రాజకీయ నాయకుల ఆదేశాలతో జివిఎంసి అధికారులు, సిబ్బంది ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. కాలి బాటలు పూర్తిగా ఆక్రమణలకు గురికావడంతో బాటసారులు రహదారుల మీదనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. పర్యాటక ప్రదేశాలైన కైలాసగిరి, సాగరతీరం వైపు వెళ్లే వాహనాలు ఈ రహదారిలో ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఈ రహదారి చాలా రద్దీగా ఉంటుంది. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని బాటసారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు, జివిఎంసి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఆలోచించి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు పూర్తిగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఫుట్‌పాత్‌పై ఏర్పాటుచేసిన బడ్డీలు



అడ్మిన్ జిఎం చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న గంగారావు

## పెంచిన పార్కింగ్ ఫీజు రద్దుచేయాలి

### 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు

ప్రజాశక్తి-ఉక్కునగరం : పెంచిన పార్కింగ్ ఫీజులను వెంటనే రద్దుచేయాలని 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్‌చేశారు. ఈ మేరకు స్టీల్ ప్లాంట్ టౌన్ అడ్మిన్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్‌కు కార్పొరేటర్ గంగారావు, స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ పర్సనల్ ఎస్‌పి.పాండేకు స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) నాయకులు వైటి.దాస్, యు.రామస్వామి వినతిపత్రాలు అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల సౌకర్యార్థం కూర్మన్నపాలెంలో ఏర్పాటుచేసిన పార్కింగ్ షెడ్లలో ఫీజులను 12 గంటలకు ఉండే రూ.2 ఫీజును ఏకంగా రూ.12కు 24 గంటలకు రూ.24కు, నెలవారీ ఫీజు 12 గంటలకు రూ.360, 24 గంటలకు రూ.720కి పెంచి, మే 1వ తేదీ నుంచి అమలులోకి వస్తుందంటూ సునీత పద్మశ్రీ ఎంటర్‌ప్రైజెస్ కాంట్రాక్టరు ప్రకటించారని తెలిపారు. దీన్ని విశాఖ ఉక్కు కార్మికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, పెంచిన పార్కింగ్ ఫీజులు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిరంతరం ఉద్యోగులు సుదూర ప్రాంతాల నుంచి విధులకు హాజరవుతున్నారని, వారికి సరైన రవాణా సదుపాయం లేక సొంత వాహనాలను ఇక్కడ పార్కింగ్ చేసుకుంటున్నారని తెలిపారు. ఈ పార్కింగ్ షెడ్ల నిర్వహణను వికలాంగులకు ఉపాధి కల్పించే నిమిత్తం యాజమాన్యం ఇచ్చిందని, ఆ షెడ్లను కూడా ఆదాయాన్ని సమకూర్చుకునే వనరులుగా చూడటం దుర్మార్గమని పేర్కొన్నారు. కార్మికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ షెడ్లను వారికి భారంగా మార్చటం సరికాదని, వెంటనే పెంచిన పార్కింగ్ ఫీజులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరిగానే నిర్వహించాలని, ఈ విషయంలో అధికారులు జోక్యం చేసుకోవాలని కోరారు.



దీక్షలో కూర్చున్న పోర్టు కార్మికులు

## పోర్టు హాస్పిటల్‌ను రక్షించుకుంటాం

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ కాకుండా కాపాడుకుంటామని నాయకులు స్పష్టంచేశారు. పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సిఐటియు ఆధ్వర్యాన ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 219వ రోజుకు చేరుకున్నాయి. ఇటీవల మృతిచెందిన హెచ్‌ఎంఎస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు మహ్మద్ హనీఫ్‌కు, మంగళవారం హఠాన్మరణం పొందిన సిఐటియు నాయకులు జి.అప్పలరాజుకు దీక్షా శిబిరంలో పాల్గొన్న నాయకులు, కార్మికులు నివాళ లర్పించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ జనరల్ సెక్రటరీ డికె.శర్మ, సిఐటియు నాయకులు కె.సత్యనారాయణ, జక్కం సత్యనారాయణ, బి.లక్ష్మణరావు, గణేష్ శంకర్, ఎల్లారావు, ఈశ్వరరావు, కెఎన్.కుమార్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## 'మాక్‌డ్రిల్‌లో భాగస్వామ్యం కావాలి'

ప్రజాశక్తి-సీతమ్మధార : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మేరకు మాక్‌డ్రిల్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఆడారి కిషోర్ కుమార్ పిలుపునిచ్చారు. పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పాకిస్థాన్, భారత్ మధ్య యుద్ధ వాతావరణ నేపథ్యంలో ప్రజలకు రక్షణపై అవగాహన కల్పించేందుకు మాక్‌డ్రిల్‌లు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, అడ్వకేట్లు, కరాటే బ్లాక్ బెల్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాలి

### వైసిపి జిల్లా అధ్యక్షులు కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వ వైఫల్యాలను నిలదీయాలని వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు కెకె.రాజు కార్యకర్తలకు, పిలుపునిచ్చారు. సీతమ్మధారలోని క్యాంపు కార్యాలయంలో ఉత్తర నియోజకవర్గం పరిధిలోని వార్డు కార్పొరేటర్లు, అధ్యక్షులు, కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు, ముఖ్య నాయకులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కటుమూరి సతీష్, బాణాల శ్రీనివాసరావు, అల్లు శంకరరావు, సాడి పద్మారెడ్డి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కెవిఎన్.శశికళ, నాయకులు జి.వి.రవిరాజు, జివి.రవణి, పామోటి బాబ్జి, గుజ్జు వెంకటరెడ్డి, పైడి రమణ, పీలా వెంకటలక్ష్మి, పి.సునీత, నీలి రవి, దుప్పలపూడి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెకె.రాజు

## వైసిపి ఆరోపణలను తిప్పికొట్టాలి

### ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : కూటమి ప్రభుత్వంపై వైసిపి చేస్తున్న తప్పుడు ఆరోపణలను ప్రజాక్షేత్రంలో తిప్పికొట్టాలని పార్టీ కార్యకర్తలను టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో జివిఎంసి 79, 86 వార్డుల సంస్థాగత ఎన్నికలు జరిగాయి. 86వ వార్డు అధ్యక్షునిగా నల్లూరి సూర్యనారాయణ, వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జిగా వేగుంట శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డేటి నాగజగదీష్ అప్పారావు ఎన్నికయ్యారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ధ్వంసమైన నవ్యాంధ్రను స్వర్ణాంధ్రవైపు చంద్రబాబు తీసుకెళ్తున్నారని తెలిపారు. దీన్ని జీర్ణించుకోలేని వైసిపి శ్రేణులు తప్పుడు ఆరోపణలు చేస్తూ వికృతానందం పొందుతున్నారని విమర్శించారు. ప్రజలు చావుదెబ్బ కొట్టినా వారికి జ్ఞానోదయం కలగలేదని ఎద్దేవాచేశారు.

## రామకృష్ణాపురంలో ఇళ్ల క్రమబద్ధీకరణపై రగడ



అధికారులను ప్రశ్నిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి శివారు ప్రాంతమైన కేంద్రకారాగారం ఎదురుగా గల రామకృష్ణాపురంలో ఉన్న నివాసాల క్రమబద్ధీకరణపై మంగళవారం రగడ చోటు చేసుకుంది. ఈ కాలనీలో ఎంతో కాలంగా నివాసాలు ఏర్పాటుచేసుకొని సుమారు 500 కుటుంబాలు జీవిస్తున్నాయి. ఇప్పటివరకు వారికి ఎటువంటి పట్టాలు మంజూరు కాలేదు. తమకు పట్టాలు మంజూరు చేయాలని ఇక్కడ నివాసదారులందరూ రిజిస్టర్ పోస్టు ద్వారా ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు అర్జీలు పెట్టుకున్నారు. ఈ విషయమై జివిఎంసి జోన్ -2 కమిషనర్ కనకమహాలక్ష్మి సచివాలయ సిబ్బందితో కలిసి మంగళవారం వెళ్లి మీరు పెట్టుకున్న అర్జీలకు సమాధానంగా ఇప్పటికే సచివాలయ సిబ్బంది వచ్చి ఈ ప్రాంతం వాటర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో ఉందని, పట్టాలు ఇవ్వడం కుదరదని, ఎండోమెంట్ ఇచ్చి ఉన్నారని తెలిపారు. పెట్టిన కంప్లైంట్ క్లోజ్ చేసేందుకు మీరు వేలి ముద్రలు వెయ్యాలని అడిగారు. సమస్య పరిష్కారం కాకుండా ఎలా సంతకాలు చేయమంటారని స్థానికులు ఎదురు ప్రశ్నించారు. దీంతో అధికారులకు, స్థానికులకు వాగ్వివాదం చోటు చేసుకుంది. అదే క్యాచ్‌మెంట్ ఏరియాలో అదే సర్వే నెంబరులో శ్రీకృష్ణాపురం, ఎస్‌ఎస్‌ఎన్ నగర్, పైనాపిల్ కాలనీ, దూల్‌పేట ప్రాంతాలు ఉన్నాయని, అదే 26 సర్వే నెంబరులో పోర్టుకు, రైల్వే జోన్‌కు పదుల సంఖ్యలో ఎకరాలు ప్రభుత్వం ఎలా కేటాయించిందని ప్రశ్నించారు. వారికి వర్తించని నిబంధనలు తమకు మాత్రమే వర్తిస్తాయా అని జోనల్ కమిషనర్‌ను ప్రశ్నించారు. తమకు న్యాయం జరిగే వరకు ముఖ్యమంత్రికి అర్జీలు పెట్టుకుంటామని తెలిపారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## గీతంలో డెమ్‌కాన్-25 వెబ్‌సైట్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-మధురవాడ : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్) ఆతిథ్యంలో ఈ ఏడాది డిసెంబర్ 5, 6 తేదీల్లో డెమ్‌కాన్–2025 పేరిట జరగనున్న జాతీయ సమావేశాలకు సంబంధించిన ప్రత్యేక వెబ్‌సైట్, పోస్టర్‌ను మంగళవారం గీతం కార్యదర్శి ఎమ్.భరద్వాజ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమావేశాల నిర్వాహక కమిటీ కో-చైర్మన్ డాక్టర్ జి.సాంబశివరావు, డాక్టర్ కె.కుమారరాజా, డాక్టర్ ఎన్ఎస్.రాజు, సమావేశాల నిర్వాహక కమిటీ కార్యదర్శి డాక్టర్ కెవి.లూ, సహ కార్యదర్శి సిహెచ్.కిషోర్‌కుమార్, జిమ్సర్ ఆపరేషన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.కార్తిక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వృద్ధాప్యంలో ఉన్న వారు ఎదుర్కొనే డెమెన్షియా వంటి ఆరోగ్య సమస్యలు, పలియేటివ్ కేర్ ప్రాధాన్యతను వారు వివరించారు. ఈ జాతీయ సదస్సులో డెమెన్షియా ఇండియా అలయన్స్ (డిఐఎ)తో అనుబంధం ఉన్న ప్రసిద్ధ వైద్య నిపుణులు హాజరై వివిధ అంశాలపై చర్చిస్తారని తెలిపారు. గీతం ఆసుపత్రిని డెమెన్షియా అనారోగ్య సమస్యతో ఉన్న వారికి స్నేహ హస్తం అందించి అక్కున చేర్చుకునే వైద్యాలయంగా తీర్చిదిద్దాలని సూచించారు.

## విద్యా మిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రకృతి స్కూల్లో మండల విద్యా శాఖ ఏర్పాటుచేసిన 2025 - 26 విద్యా సంవత్సరానికి సంబంధించి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా మిత్ర పాఠ్య, నోట్ పుస్తకాల స్టాక్ పాయింట్‌ను ఎంఇఒలు 1, 2 ఎం.శివరాణి, ఎ.జయప్రదతో కలిసి మంగళ వారం విద్యా శాఖ రాష్ట్ర పరిశీలకులు పి.విజయలక్ష్మి పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ ఆధారంగా పాఠ్య, నోట్ పుస్తకాలను పరిశీలించారు. పాఠశాలలు తెరిచేలోపు విద్యా మిత్ర కిట్లను పాఠశాలలకు చేర్చి సకాలంలో విద్యార్థులకు అందేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. 1 నుంచి 10వ తరగతి వరకు తొలి విడతలో 29,677 పాఠ్య పుస్తకాలు, 6 నుంచి 10 వ తరగతి వరకు 59, 658 నోట్ పుస్తకాలు వచ్చాయని ఎంఇఒలు వివరించారు.

# జాతీయ సమ్మెను జయప్రదం చేయండి

## అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు



జాతీయ సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు

**ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్**

కార్మికులను బానిసలుగా చేసే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలంటూ ఈ నెల 20న జరిగే జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని విశాఖ అఖిలపక్ష కార్మిక సంఘాలు కార్మిక వర్గానికి పిలుపునిచ్చాయి. మంగళవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశం జరిగింది. సమావేశంలో నాయకులు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులను బానిసలుగా చేసి యాజమాన్యాలకు లాభాలు చేకూర్చేలా తెచ్చిన 4 లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బ్రిటిష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్చే హక్కు మోడీకి లేదన్నారు. సమ్మె జయప్రదం కోరుతూ 16న విశాఖ నగరంలోనూ, 17న పారిశ్రామిక ప్రాంతంలోనూ బైక్ యాత్రలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే అన్ని పరిశ్రమల్లోనూ సమ్మె నోటీసులను ఇచ్చామన్నారు. ఆ రోజు ట్రాన్స్‌పోర్ట్ కూడా పూర్తిగా బంద్ అవుతుందని, ఆటో, మోటార్ కార్మికులు స్వచ్ఛందంగా బండ్లు నిలిపివేయాలని కోరారు. సమ్మె జయప్రదం కోసం అన్ని పరిశ్రమల వద్ద గేటు మీటింగులు, కార్మికుల పని ప్రదేశాల్లోనూ, నివాస ప్రాంతాల్లోనూ సభలు నిర్వహించాలని, పోస్టర్లు, కరపత్రాలు ద్వారా ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ఈ నెల 20న నగరంలో డిఆర్ఎం కార్యాలయం నుంచి భారీ కార్మిక ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించామన్నారు. సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథరావు, సిఎఫ్‌టియుఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, ఎపిఎఫ్‌టియు నాయకులు దేవా, ఎసిటియు నాయకులు కె.శంకర్రావు, వైఎస్ఆర్‌టియుసి నాయకులు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

### మెడికల్ రిప్స్ సమ్మె నోటీసు

సమ్మెలో మెడికల్ రిప్రజెంటేటివ్స్ పాల్గొంటారని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (ఎపిఎంఆర్ఎస్‌యు) రాష్ట్ర కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి తెలిపారు. మంగళవారం యూనియన్ జిల్లా కార్యదర్శి డి.స్రవంత్ ఆధ్వర్యంలో జిఎస్‌టి జాయింట్ కమిషనర్ విశాఖపట్నం డివిజన్-1, 2 సంయుక్త కార్యదర్శులకు సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.సంజయ్ కుమార్, కెకె.చౌదరి పాల్గొన్నారు.

### సమ్మె నోటీసులు

**పరవాడ :** లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని మే 20న దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెకు సంబంధించి సమ్మె నోటీసును వివోఏల యూనియన్ (సిఐటియు) నాయకులు మంగళవారం పరవాడ వెలుగు ఏపీఎం రంగారావుకి అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పైడి లక్ష్మి, రమాదేవి, ఉమా, వెంకటలక్ష్మి, విజయ, వరలక్ష్మి, నీలిమ, మణి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.



పరవాడ వెలుగు కార్యాలయంలో నోటీసు ఇస్తున్న విఓఎలు


రాంబిల్లిలో సమ్మె నోటీసు ఇస్తున్న ఆశా కార్యకర్తలు

**రాంబిల్లి :** 20న జరుగు దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించిన నోటీసును రాంబిల్లి, దిమిలి పీహెచ్సీల వైద్యులకు ఆశా వర్కర్లు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి.దేముడునాయుడు ఆధ్వర్యాన అందజేశారు. కార్యక్రమంలో రెండు పీహెచ్సీల ఆశాలు పాల్గొన్నారు.

**అచ్యుతాపురం :** ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని మంగళవారం అచ్చుతాపురం. హరిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో ఆశా వర్కర్లు నినాదాలు చేశారు. 20న జరుగు సమ్మె చేస్తున్నట్లు నోటీసులను వైద్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంగమ్మ సూర్య లక్ష్మి, పార్వతి, గీత పాల్గొన్నారు.

**చోడవరం :** ఈనెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి, జిల్లా కోశాధికారి వి వి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. చోడవరంలో మంగళవారం జరిగిన సీఐటీయూ మండల సమన్వయ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మికులకు నష్టదాయకమైన లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సమ్మె చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం నేతలు ఎస్‌వి నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ ఆశ, అంగన్వాడీ యూనియన్ నాయకులు కె.వరలక్ష్మి, బి.రామలక్ష్మి, కొండమ్మ, రత్నం పాల్గొన్నారు.


తేజస్వినిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

## క్రీడల్లో ప్రతిభ చూపుతున్న తేజస్వినికి సత్కారం

**ప్రజాశక్తి-దేవరాపల్లి** జవహర్ నవోదయ స్కూల్లో విద్యను అభ్యసిస్తూ చదువులోనూ, మరో పక్క క్రీడల్లో చక్కని ప్రతిభ కనబరుస్తున్న దేవరాపల్లికి చెందిన గుల్లేపల్లి తేజస్వినిని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంగళవారం ఆమె ఇంటికి వెళ్లి సత్కరించారు. సికింద్రాబాద్ జోనల్ క్రీడల స్కూల్లో శిక్షణ పొందుతున్న తేజస్విని మార్చి నెలలో గుజరాత్‌లో జరిగిన జాతీయస్థాయి పారా టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలలో తృతీయ స్థానంలో నిలిచి, కాంస్య పతకం సాధించింది. తన కూతురు సాధించిన విజయాల గురించి తేజస్విని తండ్రి గుల్లిపల్లి అర్జునరావు ఎమ్మెల్యేకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, కిలపర్తి భాస్కరరావు, పోతల పాత్రునాయుడు, శరకాన సూర్యనారాయణ, సోమిరెడ్డి గోవింద, కొమార బాబురావు, సబ్బవరపు మాలి బాబు, పెద్దాడ వెంకటరమణ, కడిమి నాగేశ్వరరావు, అల్లు అబద్ధం పాల్గొన్నారు.

## కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి-అచ్యుతాపురం :** అచ్చుతాపురంలో నూతనంగా నిర్మించిన డిజిటల్ లైబ్రరీలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌ను మహిళలందరూ సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మహిళా పారిశ్రామికవేత్తలు కావాలన్నారు. మిషన్‌కే పరిమితం కాకుండా బ్రాండిక్స్ లాంటి పరిశ్రమలను స్థాపించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని, మాజీ జడ్పిటిసి జనపరెడ్డి శ్రీనివాసరావు, కోన లచ్చన్న నాయుడు, జె నర్సింగరావు, కె వెంకునాయుడు, ద్వారపురెడ్డి బాబ్జి, బి.రాందాస్, ఎం.శ్రీవేణి, పి వాసు రాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు

**ప్రజాశక్తి-కె.కోటపాడు :** మండలంలోని చౌడువాడ గ్రామంలో శ్రీపెద్ద పైడిమాంబ తీర్థ మహోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లాస్థాయి ఎడ్ల పోటీలు మంగళవారం నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులకు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం జిల్లాస్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సాయంత్రం మహిళల కోలాటం, రాత్రి డాన్స్ బేబీ డాన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి దాడి ఎరుకు నాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, ఎంపీటీసీ ఏటుకూరు రాజేష్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సినీ నటి ఇంద్రజ ఆలయాల్లో పూజలు

**ప్రజాశక్తి-అనకాపల్లి :** సినిమా షూటింగ్లో పాల్గొనేందుకు అనకాపల్లి పట్టణానికి వచ్చిన ప్రముఖ సినీనటి ఇంద్రజ మంగళవారం శతకం పట్టులో ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయం, శ్రీగౌరీ పరమేశ్వరి ఆలయం, శ్రీమరిడిపంప ఆలయంలో అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నటీనటులను సత్కరించారు. కార్యక్రమంలో శ్రీ కనకదుర్గ ఆలయ వ్యవస్థాపకులు పివి రమణ, ఆలయ శాశ్వత చైర్మన్ కాండ్రేగుల నాయుడు దంపతులు, ఆలయ అధ్యక్షులు భీమరశెట్టి వర నూకరాజు, శ్రీగౌరీ పరమేశ్వరుల ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావు నాయుడు, పొలిమేర శ్రీను, గండేపల్లి మురళి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


సినీనటి ఇంద్రజకు జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

## వితంతు పింఛనుపై అధికారుల ఆరా

### -ప్రజాశక్తి కథనానికి స్పందన

**ప్రజాశక్తి -బుచ్చయ్యపేట :** 'వితంతు పింఛను మంజూరులో మెలిక' శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో మంగళవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ కథనంపై వివరాలు సేకరించాలని దిబ్బిడి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్‌ను ఎంపిడిఒ వి.విజయలక్ష్మి ఆదేశించారు. మంగళవారం మండలంలోని దిబ్బిడి గ్రామంలో గత రెండు సంవత్సరాలుగా వితంతు పెన్షన్ కోసం ఎదురు చూస్తున్న జెర్రిపోతుల ఘాటీలమ్మ వద్ద నుండి వివరాలు సేకరించారు. ప్రభుత్వ జిఓలో పొందుపరచిన తేదీలో సదరు పింఛనుదారుకు కొత్త పెన్షన్ పొందడానికి అవకాశం లేదని సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రసాద్ ఎంపిడిఒకు నివేదిక సమర్పించారు.

## పవర్ టిల్లర్ అందజేత

**ప్రజాశక్తి-బుచ్చయ్యపేట :** ప్రభుత్వం మంజూరు చేసిన పవర్ టిల్లర్లను స్థానిక రైతులకు మంగళవారం మాజీ ఎంపీటీసీ మరిసా సతీష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో పవర్ టిల్లర్ ధర రూ.2,29,500 కాగా, ప్రభుత్వం లక్ష రూపాయలు ఇసుండగా రైతు రూ.1,29,500 చెల్లించాల్సి ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మరిసా పెదరమణ, మరిసా నరేష్, మరిసా శ్రావణ్, యన్నంశెట్టి నాయుడు, నడిపల్లి రమణ, కంటంరెడ్డి నాగ అప్పారావు, కంఠంరెడ్డి గోవిందా, ఆకుల నాగేశ్వరావు, రైతు సేవా కేంద్రం ఇంచార్జ పి.సంతోష్, రైతులు పాల్గొన్నారు.

## హౌస్ కమిటీపై హర్షం

**ప్రజాశక్తి-అనకాపల్లి :** జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, ఆప్కాబ్లో జరిగిన అవినీతిపై రాష్ట్ర ప్రభుత్వం అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణను చైర్మన్‌గా హౌస్ కమిటీ వేయడం పట్ల జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పూర్వపు మేనేజర్ విల్లూరి పైడారావు మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులోలో జరిగిన అవినీతిపై ఫిర్యాదులను స్వీకరించి రైతుల డబ్బులను కాపాడాలని హౌస్ కమిటీ చైర్మన్ కొణతాల రామకృష్ణను కోరారు.

## నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం చేయాలి

### జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

**ప్రజాశక్తి-అచ్యుతాపురం, మునగపాక**

అచ్యుతాపురం -అనకాపల్లి రహదారి విస్తరణ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. రహదారి విస్తరణ పనులను మంగళవారం ఆమె ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌తో పరిశీలించారు. మునగపాక, హరిపాలెంలో నిర్మిస్తున్న కల్వర్టు పనులు, అచ్యుతాపురం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ కోసం వేసిన టెస్ట్ పైల్‌ను పరిశీలించారు. కొండకర్ల గ్రామంలోని కాంట్రాక్టర్ క్యాంపు కార్యాలయంలో నాణ్యత నియంత్రణ ల్యాబ్‌ను పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. మొదట రోడ్డు విస్తరణలో చేపడుతున్న ఎస్ఎన్ డ్రైన్స్, క్లోజ్డ్ ట్రైన్స్, ఇరిగేషన్ కెనాల్స్ కోసం ఆర్ అండ్ బి ఈఈ వేణుగోపాల్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ పోల్స్ షిఫ్టింగ్ పనులను చేపట్టాలని, కల్వర్టు నిర్మాణాలకు అందుబాటులోని భూమి గుర్తించి కల్వర్టు పనులను చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ వేణుగోపాల్, డిఈ రాధాకృష్ణ, కూటమి నాయకులు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురాం, ఎమ్మార్వో ఆదిమహేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

## ఎస్ఇజెడ్ నిర్వాసితులతో ఆర్‌డిఒ సమావేశం

**ప్రజాశక్తి-రాంబిల్లి :** మండలంలోని కృష్ణం పాలెం గ్రామంలో ఎస్ఇజెడ్ భూ నిర్వాసితులతో అనకాపల్లి ఆర్‌డిఒ ఎస్‌కె.అయేషా సమావేశం నిర్వహించారు. 2006లో భూసేకరణ సందర్భంగా భూములు, ఇల్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించకుండా జాప్యం చేయడం దారుణమని బాధితులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ అచ్చుతాపురం మండలం, రావిపాలెం ఏరియాలో పునరావాసం కల్పిస్తామని, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద ప్రతి కుటుంబానికి ఎనిమిది లక్షల 36వేల రూపాయలు చెల్లిస్తామని, అర్హులైన మేజర్ కుమారులకు, కుమార్తులకు కూడా ఐదు సెంట్లు ఇళ్ల స్థలం, 8,36,000 ప్యాకేజీ చెల్లిస్తామని చెప్పారు. దీనిపై నిర్వాసిత పెద్దలు మాట్లాడుతూ తమకు షిఫ్టింగ్ ప్యాకేజీ రూ.30 లక్షల వరకు ప్రతి కుటుంబానికి ఇవ్వాలని, లేకపోతే ఇచ్చే ప్యాకేజీ ఇల్లు కట్టుకోవడానికి సరిపోదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటికి 18 సంవత్సరాలైనా తమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈజెడ్ నిర్వాసితుల సంఘం నాయకులు జి దేవుడు నాయుడు, గ్రామ సర్పంచ్ సత్తిబాబు, మాజీ సర్పంచ్ ప్రసాద్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



తహశీల్దారుకు ఫిర్యాదు చేసి బయటకొచ్చిన బాధితులు

## బిజెపి నేత భూ కబ్జాపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండల కేంద్రం కె.కోటపాడులో బిజెపి నేత భూ కబ్జాపై బాధితులు మంగళవారం స్థానిక తహసీల్దార్ రమేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.... కె.కోటపాడులో రొంగలి, పైలా కుటుంబాలకు తాత ముత్తాతల నుండి ఉమ్మడిగా 69 సెంట్లు భూమి ఉంది. ఈ భూమిని బిజెపి మండల అధ్యక్షురాలు పైలా అమ్మాజీ తన భర్త ఈశ్వరరావు పేరున ఆన్లైన్‌లో నమోదు చేయించుకుని స్థానిక కో-ఆపరేటివ్ బ్యాంకులో రుణం పొందారు. దీనిపై బాధితులు పైడమ్మ చెరువు ఆయకట్టుదారుల సంఘం అధ్యక్షుడు పైలా గంగు నాయుడు, రొంగలి చిరంజీవి, రొంగలి అబద్ధం, పైలా గోపి తదితరులు మంగళవారం తహశీల్దార్ రమేష్‌బాబును కలిసి జరిగిన సంఘటనలను వివరించారు. పైల అమ్మాజీని రెండు కుటుంబాల పెద్దలు అడుగ్గా తనపై దాడులకు దిగుతున్నారని తిరిగి తమపైనే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. తనకు రాజకీయ నాయకుల అండ ఉందని, తనను ఎవరూ ఏమీ చేయలేరని అమ్మాజీ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు పబ్లిక్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అందరి ఉమ్మడి ఆస్తికి మోసపూరిత రికార్డులు సృష్టించి తమను మోసం చేసినట్లు ఆరోపించారు. అధికారులు దీనిపై బహిరంగ విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

## 'అన్నదాత సుఖీభవ'కు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : రైతులు వెబ్‌సైట్‌లో అన్నదాత సుఖీభవ' పథకం కోసం ఈ నెల 20వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.స్వప్న తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం ఒక్కో రైతుకు రూ.20 వేలు చొప్పున సాయం అందచేస్తుందని చెప్పారు. సొంత భూమి లేని కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు కలిగి ఉంటే వారికి కూడా ఇది వర్తిస్తుందని చెప్పారు. ఈ రూ.20 వేలల్లో పీఎం కిసాన్ పథకం కింద ఇచ్చే రూ.6 వేలు కూడా కల్పడం జరిగిందని చెప్పారు. అటవీ భూములపై హక్కులు ఉన్నవారికి కూడా ఈ పథకం వర్తిస్తుందని చెప్పారు. వ్యవసాయ శాఖ సిబ్బంది రైతుల వివరాలను పరిశీలించి, అర్హుల జాబితాను తయారు చేయడం జరుగుతుందని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరేలా కృషి చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో అధిక శాతం విద్యార్థులు చేరేలా ఉపాధ్యాయులు, అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో కస్తూరిబా బాలికల విద్యాలయంలో కోటి 64 లక్షల రూపాయలు సర్వ శిక్ష అభియాన్ నిధులతో అదనపు తరగతుల భవనానికి ఎమ్మెల్యే మంగళవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం సర్కారు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రొంగలి మహేష్, దాడి ఎరుకనాయుడు, బొడ్డు అక్కునాయుడు, కన్నూరు సూర్యనారాయణ, జోగ దేవుడు, ఎంఈఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**దేవరాపల్లి** : బాలికల విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బండారు అన్నారు. మండలంలోని బేతపూడి కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో రూ.164.02 లక్షలు సమగ్ర శిక్ష నిధులతో జూనియర్ కళాశాలకు అదనపు తరగతులు గదులు నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు మంగళవారం శంకుస్థాపన చేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు బి.వడాలదాస్, ఉషారాణి, ఎంపీడీవో ఎంవి సువర్ణరాజు, కేజీబీవీ ప్రత్యేక అధికారి సిహెచ్ భువన మాధురి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాధ, టిడిపి నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, కిలపర్తి భాస్కరరావు, పోతల పాత్రునాయుడు, శరకాన సూర్యనారాయణ, చల్లా నానాజీ, చల్లా తాతీయులు, కేజీబీవీ ఎస్ఎంసి చైర్మన్ యలమంచిలి భారతి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# నేర విచారణలో ఫోరెన్సిక్ ఆధారాలు కీలకం

### డిఐజి గోపీనాథ్ జట్టి

ప్రజాశక్తి-అనకాపల్లి

నేర విచారణలో ఫోరెన్సిక్ ఆధారాలు పాత్ర చాలా కీలకమనివిశాఖపట్నం రేంజ్ డిఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. నేరాల దర్యాప్తులో ఆధునిక శాస్త్రీయ విధానాల ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకుని, అనకాపల్లి పట్టణంలోని శంకరం జీవీఎంసీ హాల్లో (గుండాల జంక్షన్) జిల్లా పోలీసులు సమీక్షా సమావేశం, శిక్షణ వర్క్‌షాప్‌ను మంగళవారం నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ నేరస్థలాల్లో ఫోరెన్సిక్ ఆధారాల సేకరణ, నిర్వహణ, 'చైన్ ఆఫ్ కస్టడీ' పాటించాల్సిన విధానాలపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బాధితులకు న్యాయం జరగాలంటే, దర్యాప్తు అధికారులు, ఫోరెన్సిక్ వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పరస్పర సహకారంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్మెంట్ శిక్షణ ద్వారా నిందితులకు తగిన శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమం దర్యాప్తు నాణ్యతను పెంచడంలో దోహదపడుతుందన్నారు. వర్క్‌షాప్‌లో నార్కోటిక్స్, మత్తు పదార్థాలు, విషపదార్థాలు (టాక్సికాలజీ), డిజిటల్ ఆధారాలు, సైబర్ నేరాల పరికరాలు, ఆడియో-వీడియో ఫుటేజ్, డీఎన్ఏ, రక్త నమూనాలు, మానవ అవయవాలు వంటి ఆధారాల సేకరణ, ప్యాకింగ్, భద్రపరచే విధానంపై వంటివాటిపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణను ఆర్ఎఫ్ఎస్ఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వి.నాగరాజు, శాస్త్రీయ సహాయకులు ఎం.రాంబాబు, పివిఎస్‌బి.చలపతి, ఇ.కిరణ్ కుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, డీఎస్పీలు ఎం.శ్రావణి, పి.శ్రీనివాసరావు, వి.విష్ణు స్వరూప్, ఫోరెన్సిక్ వైద్యులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీస్ ఇన్స్పెక్టర్లు లక్ష్మణ్‌మూర్తి, బాల సూర్యారావు, లక్ష్మి, విజయ, ఎస్సైలు ప్రసాద్, రమణయ్య, సురేష్ బాబు, సీఐలు, ఎస్సైలు, స్టేషన్ రైటర్లు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

# గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండల సమావేశంలో పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. ఎంపిపి డి.నాగేశ్వరి దేవి అధ్యక్షతన మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు ఆర్డబ్ల్యూఎస్ అధికారుల తీరుపై మండిపడ్డారు. గున్నెంపూడి, వడ్డాది-2 ఎంపిటిసిలు మాట్లాడుతూ మండల పరిషత్తు నిధులతో తమ గ్రామాల్లో ఏర్పాటు చేసిన తాగునీటి బోర్లు ప్రారంభోత్సవానికి తమకు ఆహ్వానం లేదని వాపోయారు. కొండపాలెం, పెద్దమదిన, చిన్నభీమవరం గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు మచ్చకర్ల భవాని సభ దృష్టికి తీసుకొచ్చారు. కెవిఆర్ నాయుడు సభ దష్టికి తీసుకొచ్చారు. విజయరామరాజుపేటలో జల్ జీవన్ మిషన్ పైపులు వేయడానికి రోడ్డు తవ్వి వదిలేశారని సర్పంచ్ ఎల్లపు విజయ్ కుమార్ చెప్పారు. ఐతంపూడి గ్రామంలో కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని సర్పంచ్ పెద్దాడ నాయుడు కోరారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరు చేస్తామన్నారు. పద్మాది వెంకటేశ్వర స్వామి ఆర్చ్‌కి ఎదురుగా రూ.2 కోట్లు విలువైన గ్రామకంఠం స్థలం ఆక్రమణకు ప్రయత్నిస్తున్నారని వైస్ ఎంపిపి దొండ నారాయణమూర్తి తహసిల్దార్ ఎం.లక్ష్మీ దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయ శాఖ ఏవో భాస్కర్‌రావు, ఈఓపిఆర్డి విజయలక్ష్మీ పాల్గొన్నారు.

## తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి-పరవాడ : పరవాడ తహశీల్దారు కార్యాలయం సమీపంలో బ్యాంక్ కాలనీ వద్ద మంగళవారం సాయంత్రం తుక్కు దుకాణంలో అగ్ని ప్రమాదం సంభవించింది. తుక్కు దుకాణంలో ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములు, చెక్క పెట్టెలు, సామాగ్రి కాలి బూడిదయ్యాయి. గతంలో ఇదే తుక్కు దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం సంబంధించి మూడు రోజులు అగ్ని జ్వాలలు ఎగిసిపడ్డాయి. అయినా కూడా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం కూడా సరిగ్గా పరివేక్షణ లేకపోవడంతో మళ్లీ ప్రమాదం చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ స్క్రాప్ దుకాణం చుట్టూ ఎటువంటి ప్రహరీ గోడ లేదు. ఎక్కడ పెడితే అక్కడ ప్లాస్టిక్ డ్రమ్ములు, సాల్వెంట్ డ్రమ్ములు, ఇతర కెమికల్స్ అన్ని కూడా విచ్చలవిడిగా పడవేసి ఉన్నాయి. దీంతో ఏ చిన్న అగ్నిరవ్వ తగిలినా భారీ ప్రమాదం జరుగుతోంది. సంబంధిత ప్రాంతాన్ని పోలీస్, రెవెన్యూ, ఫైర్ సర్వీస్ అధికారులు పర్యటించి ప్రమాద కారణాలపై దర్యాప్తు చేపట్టారు. అగ్ని ప్రమాద ప్రాంతాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ సందర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ చేసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ తుక్కు దుకాణానికి అగ్నిమాపక శాఖ, రెవెన్యూ, కార్మిక శాఖ నుండి ఏ విధమైన అనుమతులు లేవని గనిశెట్టి తెలిపారు. సమగ్ర విచారణ చేసి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

## వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ డిమాండ్ చేశారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని పైడివాడ గ్రామంలో వర్షాలకు సేనాపతి అప్పారావు అనే రైతుకి చెందిన ఎకరా వరి పంట పూర్తిగా దెబ్బతిందని, ఇంతవరకు అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. మండలంలోని ఇటీవల కురిసిన వర్షాలకు జరిగిన పంట నష్టంపై తాము జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. అధికారులు స్పందించి మండలంలో జరిగిన పంట నష్టాలపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు ఏటా రూ.20వేలు ఇస్తామని ఎన్నికల్లో చెప్పి నేటికీ దానిని అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో వైసిపి నేతలు కోటాన రాము, వడ్డాది అప్పలరాజు, దనిమిరెడ్డి శ్రీను, బలిరెడ్డి కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## 8న సత్యనారాయణస్వామి కల్యాణ మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక సుంకరమెట్ట శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి కళ్యాణం ఈనెల 8న దేవస్థానంలో జరుగుతుందని ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను అనకాపల్లి జనసేన పార్టీ ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ చేతుల మీదుగా జనసేన పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో చదరం నాగేశ్వరరావు, మంగా ఈశ్వరరావు, కొణతాల మాధవ్, పెంటకోట చంద్రరావు, మారిశెట్టి భాస్కరరావు, శ్రీకాకుళం గణపతి, సూరిశెట్టి బల్లమ్మ, దొడ్డి భరత్ పాల్గొన్నారు.

## రోడ్డుపై గోతులు పూడ్చివేత

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని రాజాం-తట్టబంద రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. రాజాం నుండి సీతయ్యపేట వెళ్లే వరకు రోడ్డు అధ్వానంగా మారింది. ఏ మాత్రం వర్షం కురిసినా గోతులలో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తైపురంలో సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను మంగళవారం ఈ రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. గోతుల్లో మెటల్, రాయి, క్రషర్ బుగ్గి వేయించి జెసిబీతో చదును చేయించారు. దీనితో వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు.

## కోర్టుకు స్థలం లేదు.. అధికార పార్టీకి ఉందా?

ప్రజాశక్తి-అనకాపల్లి : కొన్ని సంవత్సరాలుగా అనకాపల్లిలో కోర్టుకు స్థలం కేటాయించని అధికార యంత్రాంగం అధికార టిడిపి కార్యాలయానికి క్షణాల్లో స్థలం కేటాయించడం శోచనీయమని ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిఎస్ అజయ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనకాపల్లి కేంద్రంలో ఉన్న వివిధ న్యాయస్థానాలు సరైన సౌకర్యాల్లేని ఒక ప్రైవేటు అద్దె భవనంలో నడుస్తున్నాయని తెలిపారు. కోర్టు సముదాయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని అనేక సంవత్సరాలుగా న్యాయశాఖ, ఉమ్మడి విశాఖ జిల్లా కలెక్టర్‌కు, అనకాపల్లి జిల్లా కలెక్టర్‌కు లేఖలు రాస్తూనే ఉందని తెలిపారు. న్యాయవాదులు కూడా పలుమార్లు వినతి పత్రాలు అందజేశారని గుర్తు చేశారు. స్థలాలు దొరకటం లేదని జిల్లా రెవిన్యూ యంత్రాంగం చెబుతూ వచ్చిందని పేర్కొన్నారు. కాని అధికార టిడిపి అడిగిన వెంటనే మంత్రివర్గం తీర్మానంతో సంబంధం లేకుండా తుమ్మపాల రెవిన్యూ సర్వే నంబర్ 608-1లో రెండు నుండి మూడు కోట్ల రూపాయల విలువైన రెండు ఎకరాల స్థలాన్ని ఒక ఏడాదికి కేవలం రూ.1000 అద్దెతో 33 సంవత్సరాలకు జిల్లా కలెక్టర్ భూమిని అప్పగించారని తెలిపారు. నాలుగు రోజుల్లోనే అన్ని వ్యవహారాలు పూర్తి చేసి టిడిపికి అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు, న్యాయశాఖ అర్జీలు పక్కన పెట్టి అధికార టిడిపి తమకు భూమిని కేటాయింపజేసుకోవడం దారుణమన్నారు. తక్షణమే లీజ్ అగ్రిమెంట్ను రద్దు చేసి సదరు భూమిని న్యాయస్థానాల నిర్మాణం కోసం అప్పగించాలని కోరారు.

## మజ్జిగ పంపిణీ ప్రారంభం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరాపల్లి సత్యసాయిబాబా ధ్యాన మందిరం ప్రాంగణంలో సత్యసాయి భక్తులు వేసవి దృష్ట్యా పాదచారులకు బుధవారం నుంచి మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

## గర్భస్థ శిశు లింగ నిర్ధారణపై కఠిన చర్యలు


ప్రజాశక్తి-అనకాపల్లి : గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి అధికారులను ఆదేశించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా డిఆర్ఓ వై.సత్యనారాయణ రావు మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం 1994 ను కఠినంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం లింగనిష్పత్తి 1000 మంది బాలురు, 972 బాలికలుగా ఉందని, లింగ నిష్పత్తి సమానంగా ఉండేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. లింగ నిష్పత్తి మండలాల వారీగా సమీక్షిస్తూ తక్కువగా ఉన్న మండలాల సిడిపివోలు మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ చేయాలని సూచించారు. లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా ఆడశిశువు అని తెలిసి గర్భస్రావాలు చేయించడం వంటి సమాచారం తెలిస్తే 102, 104 టోల్ ఫ్రీ నంబరుకు లేదా ఆన్లైన్ గ్రీవియన్స్ pcpndt.ap.gov.in ద్వారా తెలియజేయవచ్చని చెప్పారు. ఎఎన్ఎమ్, ఆశాలు గృహ సందర్శనల ద్వారా ఆడపిల్లల సంరక్షణ ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శాంతిప్రభ మాట్లాడుతూ జిల్లాలో 73స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. స్కానింగ్ కేంద్రాలను మూడు నెలలకు ఒకసారి తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. డెకాయ్ ఆపరేషన్ కూడా చేపడుతున్నట్లు తెలిపారు. బాలికలు సంరక్షణపై ప్రచారం చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ మోహన్ రావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనంతలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్‌ఓలు బాలాజీ, కెవి.జ్యోతి, డిఐఒ, పాల్గొన్నారు.

# ఒక్క రోజు తేడాతో అందని పింఛను!

- అశనిపాతంగా స్పౌజ్ పెన్షన్ నిబంధనలు
- 2023 డిసెంబర్ ఒకటికి ముందు చనిపోయిన వారందరికీ మొండిచేయి
- నిబంధనలు సడలించాలని అర్హుల వేడుకోలు



పెన్షన్‌కు నోచుకోని శాంతమ్మ



శాంతమ్మ భర్త పైడికొండ పెన్షన్ కార్డు

ప్రజాశక్తి - కొత్తకోట : ఒక్క రోజు తేడాతో సామాజిక భరోసాగా ఇచ్చే వితంతు పింఛనుకు అర్హత కోల్పోయింది. అన్నింటా అర్హురాలైనప్పటికీ, రెండేళ్లుగా అధికారులు, కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పింఛను భాగ్యానికి నోచుకోని దుస్థితి నెలకొంది. గత వైసిపి, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ తనకు న్యాయం, భరోసా దక్కకపోవడంతో ఆ వృద్ధ, వితంతువు ఆవేదన వ్యక్తం చేస్తోంది. సామాజిక పింఛను మంజూరుకు ప్రభుత్వం, అధికారుల కరుణ కోసం ఎదురుచూస్తోంది.

రావికమతం మండలం కొత్తకోటకు చెందిన నెల్లూరు శాంతమ్మ అనే వృద్ధ, వితంతువు రెండేళ్లుగా పింఛను కోసం ఎదురుచూస్తోంది. ప్రభుత్వం పెట్టిన నిబంధనల మెలికలో చిక్కుకుపోయి, ఒక్కరోజు తేడా వచ్చినందుకు ఏకంగా పింఛనుకు నోచుకోక ఆవేదన చెందుతోంది. శాంతమ్మ భర్త నెల్లూరు పైడి కొండ 2023 నవంబర్ 29న అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటికే పైడికొండకు ప్రతి నెలా సామాజిక పింఛను వచ్చేది. భర్త మరణంతో తనకు పింఛన్ వస్తుందని ఆశ పడిన వృద్ధ, వితంతువుకు ఇన్నాళ్లుగా నిరాశ మిగిలింది. ఆదుకుంటాడు అనుకున్న కొడుకు కోవిడ్ కాటుకు బలయ్యాడు. భర్త మరణంతో పెద్దదిక్కును కోల్పోయి ఏకంగా దిక్కులేనిదైంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో కుమార్తె చెంతన చేరిన శాంతమ్మకు గత వైసిపి ప్రభుత్వం పింఛను మంజూరు చేసి ఆదు కుంటుందని ఎదురు చూసింది. అయినా పింఛన్ మంజూరు కాలేదు. తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛను లబ్ధిదారుడైన భర్త చనిపోతే, ఆ పెన్షన్‌ను స్పౌజ్ కోటాలో మరుసటి నెలనుంచే భార్యకు అందజేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్న నిబంధనలు శాంతమ్మ పాలిట శాపంగా మారాయి.

కూటమి ప్రభుత్వం జారీ చేసిన నిబంధన ప్రకారం 2023 డిసెంబర్ ఒకటి తర్వాత భర్త మృతి చెందితే భార్యలకు వారి పింఛను బదలాయించాలని ఉంది. అయితే శాంతమ్మ భర్త పైడికొండ, ప్రభుత్వం పేర్కొన్న నిబంధన గడువుకు ఒక్కరోజు ముందు అంటే 2023 నవంబర్ 29న చనిపోవడంతో ఆమె పింఛనుకు అర్హురాలు కాకుండా పోయింది. ఈ నిబంధనను పక్కన పెడితే, మామూలుగానైనా పింఛను పొందేందుకు అటు వృద్ధురాలిగానైనా, లేకుంటే వితంతువుగానైనా శాంతమ్మ అన్ని విధాలా అర్హురాలు. పింఛను కోసం శాంతమ్మ పడుతున్న అగచాట్లు పరిశీలించిన చోడవరం నియోజకవర్గం మహిళా అధ్యక్షులు కోట నీలవేణి ఆమె సమస్యను ఎమ్మెల్యేతో పాటు మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే స్పౌజ్ నిబంధనల్లో ఒక్కరోజు ముందు చనిపోవడం వల్ల ఆమెకు పింఛను వర్తించదని దరఖాస్తు తిప్పిపంపడంతో శాంతమ్మ లబోదిబోమంటోంది. అన్నివిధాలా అర్హతలున్న అభాగ్యురాలినైన తనకు పింఛను ఇచ్చి ఆదుకోవాలని శాంతమ్మ వేడుకుంటోంది.

**పింఛనుకు పలువురు అర్హులు ఎదురుచూపులు**

ప్రభుత్వం విధించిన నిబంధనల దెబ్బకు రావికమతం మండలంలో 2023 డిసెంబర్ 1కు ముందు భర్తలు చనిపోయిన 52 మంది వితంతువులు ఎదురుచూస్తున్నారు. వీరితోపాటు 172మంది వృద్ధులు, వికలాంగులు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే కొత్త . పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం పెట్టిన మెలిక వీరి పాలిట అశనిపాతంగా మారిందని వీరంతా వాపోతున్నారు. అర్హులు, దిక్కులేని వారికి పింఛన్లు ఇచ్చి ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇలా నిబంధనలతో వారికి పెన్షన్లు ఇవ్వకుండా మోకాలడ్డడం దుర్మార్గమని పలువురు ఆరోపించారు.

## వైద్యానికి సాయం చేసి ఆదుకోరూ.?

**అచేతనావస్థలో కల్లుగీత కార్మికుడు నూకరాజు**

**దాతల సాయం కోసం అర్థిస్తున్న బాధితులు**



ప్రమాదస్థలిలో అచేతనావస్థలో, కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ బాధితుడు

ప్రజాశక్తి -నక్కపల్లి :మండలంలోని చందనాడ గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు దారా నూకరాజు ఇటీవల తాటి చెట్టు నుంచి ప్రమాదవశాత్తు కిందన పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో నూకరాజు రెండు చేతులు విరిగిపోగా, వెన్నుముక దెబ్బతినడంతో రెండు కాళ్లుపనిచేయలేదు. విశాఖపట్నం కెజిహెచ్‌లో ప్రస్తుతానికి చికిత్స పొందుతున్నాడు. నూకరాజుకు భార్య భూలక్ష్మి, ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరంతా నూకరాజు సంపాదన పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కుటుంబం పెద్ద నూకరాజు తీవ్రంగా గాయపడి మంచాన పడటంతో, అతని భార్య, పిల్లలు దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. గాయపడ్డ నూకరాజుకు ప్రైవేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని కుటుంబ సభ్యులు భావించినప్పటికీ, ఆర్థిక స్తోమత లేకపోవడం వల్ల కెజిహెచ్‌లో జాయిన్ చేశారు. ప్రభుత్వం, దాతలు ముందుకొచ్చి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు. గాయపడ్డ నూకరాజుకు మెరుగైన చికిత్స కోసం దుర్గాప్రసాద్ ఫోన్‌పే నెంబర్ 7032323765 కు ఆర్థిక సహాయం చేయాలని కుటుంబ సభ్యులు అభ్యర్థిస్తున్నారు.

## ఘనంగా పరదేశమ్మ పండగ

ప్రజాశక్తి- కోటవురట్ల : మండలంలో రాజుపేట గ్రామంలో పరదేశమ్మ పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు సర్పంచ్ బొడ్డేటి వెంకటరమణ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి మొక్కులు పసుపు, కుంకుమ, బోనాలు సమర్పించారు, రాష్ట్ర హోం మంత్రి అనిత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా స్థానిక నాయకులు ఏర్పాటు చేశారు, రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే పండుగ కావడంతో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికులు బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కిశోర వికాసంపై అవగాహన

ప్రజాశక్తి- హుకుంపేట:బాలికలకు విద్యపై ఆసక్తిని పెంచడంతోపాటు 12అంశాలపై అవగాహనకు నెలరోజులపాటు కిశోర వికాసంపై అవగాహన కల్పిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సిడిపిఒ బాలామణిదేవి సూచించారు. మంగళవారం మండలంలోని దుర్గం పంచాయతీ ధారగడ్డ గ్రామంలో కిశోరవికాసంపై బాలికలకు అవగాహనా కార్యక్రమంలో మాట్లాడుతూ, కౌమార దశలో ఉన్న బాలికలకు తలెత్తే ఆరోగ్య సమస్యలతో పాటు ఇతర సమస్యలపైవారికి అవగాహన కల్పించి, వాటిని ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు. పనిప్రదేశంలో బాలికలకు లైంగిక వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాల అనర్థాలు, రుతుక్రమం, ఇతర ఆరోగ్య సమస్యలపై అవగాహన వంటి అంశాలను ఈ కార్యక్రమంలో భాగంగా బాలికలకు అవగాహన కల్పిస్తామన్నారు.కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిడిపిఒ బాలామణి దేవి

# స్టేడియం ఏర్పాటుకు కృషి

**మినీ హాకీ గ్రౌండ్ ప్రారంభోత్సవంలో హోంమంత్రి అనిత**



మినీ హాకీ గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న హోంశాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి : పాయకరావుపేట నియోజకవర్గంలో క్రీడా స్టేడియం ఏర్పాటుకు సిద్ధంగా ఉన్నామని, అధికారులు స్థల సేకరణ చేపట్టాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం నక్కపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో రూ. 1.60కోట్ల స్పోర్ట్స్ సిఇఎస్ఆ నిధులతో ఏర్పాటు చేసిన ఆస్ట్రోటర్ఫ్ హాకీ మినీ గ్రౌండ్‌ను హోంమంత్రి వంగలపూడి అనిత ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మైదానంలో క్రీడాకారులతో కలిసి హాకీ ఆడారు. ఈ సందర్భంగా సమావేశంలో అనిత మాట్లాడుతూ, నక్కపల్లిలో హాకీ క్లబ్ ఏర్పాటు చేసి, క్రీడాకారులకు శిక్షణ ఇచ్చి, పలువురు క్రీడాకారులు ఉన్నత ఉద్యోగాలలోనూ, పలువురు ఉన్నత విద్యలో రాణించేందుకు కృషిచేసిన హాకీ క్లబ్ ఫౌండర్, కానిస్టేబుల్ సూరిబాబు దృఢ సంకల్పం స్ఫూర్తిదాయకమన్నారు.రానున్న కాలంలో హాకీ నక్కపల్లిగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.క్రీడల్లో రాణించే విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉంటారని, సమస్యలతో ధైర్యంగా ఎదుర్కొనగల శక్తి వారికి ఉంటుందన్నారు.తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించే విధంగా సహకరించాలన్నారు. జిల్లా కలెక్టర్ చొరవచూపి హాకీ గ్రౌండ్‌లో కరెంట్ సమస్యను పరిష్కరించడాన్ని అభినందించారు. పాయకరావుపేటలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. త్వరలో ఈ ప్రాంతంలో స్టీల్ ప్లాంట్ రాబోతుందని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. హాకీ క్లబ్ వ్యవస్థాపకుడు బలిరెడ్డి సూరిబాబును హోంమంత్రి అనిత ఘనంగా సత్కరించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రెటరీ నాగేశ్వరరావు మాట్లాడుతూ గత జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి హాకీ గ్రౌండ్ మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్.వి రమణ, డిఇఒ అప్పారావు నాయుడు, తహసిల్దారు నరసింహమూర్తి, ఎంపిడిఒ సీతారామరాజు, డిప్యూటీ డిఇఒ అప్పారావు, హాకీ క్లబ్ కార్యదర్శి కె.తాతాజీ, కోచ్ రాంబాబు,సర్పంచ్ జయ రత్నకుమారి, వైస్ ఎంపిపిలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, జనసేన నాయకులు తోట నగేష్, గెడ్డం బుజ్జి, బోడపాటి శివ దత్, టిడిపి నాయకులు కొప్పిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

## కస్తూర్బా కాలేజీ భవనానికి శంకుస్థాపన

కోటవురట్ల : మండల కేంద్రంలో కస్తూర్బా పాఠశాలలో జూనియర్ కాలేజీ విభాగానికి రూ. 1.68 కోట్లతో శాశ్వత భవన నిర్మాణ పనులకు మంగళవారం హోంమంత్రి అనిత శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యతనిస్తుందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ చొరవతో నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి కాశీనాయుడు, ఆర్డీవో రమణ, మండల టిడిపి అధ్యక్షులు జానకి శ్రీను, తాసిల్దార్ తిరుమల బాబు, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు పాల్గొన్నారు

## చిన్నారులకు క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగామంగళవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి పి దమయంతి ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. 40మంది చిన్నారులను ఐదు గ్రూపులుగా విభజించి క్విజ్ నిర్వహించారు.అనంతరం. సమస్యలు వచ్చినప్పుడు ఆడపిల్లలు ఏవిధంగా ఎదుర్కోవాలో, పరిష్కరించుకోవాలో వంటి అంశాలను విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు జి మురళీకృష్ణ వివరించారు. బుధవారం వ్యాపారవేత్త వెలగ నారాయణరావు ఆర్థిక సహకారంతో ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులను అందిస్తామని లైబ్రేరియన్ తెలిపారు.

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయురాలు మున్నిషా బేగం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పోటీల్లో పాల్గొన్నారు.

**చదువుతో గౌరవప్రదమైన స్థానం**

ములగాడ : చదువు వల్ల సమాజంలో గౌరవం లభిస్తుందని, జ్ఞానం, నైపుణ్యాలు, ఆలోచనా శక్తి పెరుగుతాయని జాతీయ సేవా పథకం జిల్లా నోడల్ అధికారి ఇపిఎస్. భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం శాఖ గ్రంథాలయంలోవేసవి శిక్షణా శిబిరంలో 'వాతావరణ కాలుష్యం- నివారణ' అంశంపై గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ ఆధ్వర్యాన చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. 35 మంది చిన్నారులు చక్కటి చిత్రాలు గీశారు.కార్యక్రమంలో జగదాంబ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్ జ్యోతిర్మయి పాల్గొన్నారు.

## జాతీయ పోటీలకు గణేష్ ఎంపిక



వికలాంగ క్రీడాకారుడు గణేష్‌ను అభినందిస్తున్న అధికారులు

**ప్రజాశక్తి-రావికమతం :** జాతీయస్థాయి యూనిఫైడ్ వాలీబాల్ స్పెషల్ ఒలింపిక్స్ భారత్ క్రీడా పోటీలకు రావికమతం మండలం కొమిర గ్రామానికి చెందిన మానసిక వికలాంగ విద్యార్థి అప్పికొండ గణేష్ ఎంపికైనట్లు రావికమతం ఐఇఆర్‌టి ప్రత్యేక ఉపాధ్యాయుడు జగన్నాథ నాయుడు తెలిపారు. ఎపి సమగ్ర శిక్ష, స్పెషల్ ఒలంపిక్ భారత్ కమిటీ ఆధ్వర్యంలో విజయవాడలో అదిరిపల్లిలోని హీల్ పారడైజ్ స్కూల్లో జరిగిన రాష్ట్రస్థాయి స్పెషల్ ఒలంపిక్స్ భారత్ 2025 వికలాంగుల క్రీడలు వాలీబాల్ పోటీల్లో అప్పికొండ గణేష్ మంచి ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచాడని, తద్వారా జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని తెలిపారు..స్పెషల్ ఒలింపిక్ భారత్ కమిటీ జాతీయ స్థాయి క్రీడానిపుణులు రాజశేఖర్ , రాష్ట్ర సమగ్ర శిక్ష సహిత విద్య కన్సల్టెంట్ డాక్టర్ వై. నరసింహం, హిల్స్‌ప్యారడైజ్ స్కూల్ డైరెక్టర్ అజయ్ నుంచి బంగారు పతకం సర్టిఫికెట్ స్వీకరించాడనానరు. వచ్చేనెల 14న గుజరాత్, అహ్మదాబాద్ గుజరాత్‌లో జరగబోవు జాతీయస్థాయి వికలాంగుల యూనిఫైడ్ వాలీబాల్ స్పెషల్ ఒలంపిక్ భారత్ క్రీడా పోటీలకు గణేష్ ఎంపికపై ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు జగన్నాథ నాయుడు ఆనందం వ్యక్తం చేసి గణేష్‌ను అభినందించారు. జాతీయ స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులు నక్కరాజు బాల సరస్వతి, అప్పికొండ గణేష్,లను పలువురు అభినందించారు.

## మాజీ ఎంపీ రాయుడు మృతికి దిగ్భ్రాంతి

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :** రాజంపేట మాజీ ఎంపీ పాలకొండ రాయుడు మృతి పట్ల అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడిగా రాయచోటి నియోజకవర్గం నుండి నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా, రాజంపేట నుంచి ఒకసారి ఎంపీగా ఎన్నికైన రాయుడు, ప్రజల సమస్యల పట్ల చొరవతో స్పందించే నేతగా ఆయన గుర్తింపు పొందారని కొనియాడారు. పాలకొండ రాయుడి మరణం ఆయన కుటుంబ సభ్యులతోపాటు, రాయచోటి ప్రజలకు, టిడిపికి తీరని లోటని అయ్యన్నపాత్రుడు ఆవేదన వ్యక్తం చేశారు. రాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

## అరుదైన కంద దుంప పువ్వు



అర్చకులు రామకృష్ణ పెరడులో పూసిన కంద మొక్క

**ప్రజాశక్తి-కొత్తకోట :** కంద దుంప గురించి అందరికీ తెలిసిందే. అయితే ఆ దుంపకు పువ్వు పూయటం అనేది అరుదు. అటువంటిది కొత్తకోట గ్రామానికి చెందిన అర్చకులు వేప రామకృష్ణ ఇంటి పెరటిలో కంద దుంప పువ్వు మంగళ వారం కనిపించింది. కంద దుంప ఎక్కడైనా సాగు చేసిన, నాటినా దాని నుంచి మొలక వచ్చి 15 నుంచి 20 అడుగుల వరకు ఏపుగా ఎదుగుతుంది. మొక్క వేరు భాగంలో చిన్న చిన్న దుంపలు లభ్యమవుతాయి .మరల ఎండాకాలంలో ఎండిపోతుంది. అయితే అర్చకులు రామకృష్ణ ఇంటి పెరటిలో పదేళ్ల క్రితం పాతిన దుంపకు ఇపుడు అడుగున్నరకు పైగా పువ్వు పూచింది. మంగళవారం సాయంత్రం పెరటి పనులు చూస్తున్న అర్చకులు రామకృష్ణ ఆ పువ్వును గమనించి ఆసక్తిగా పరిశీలించారు. గడిచిన 15 ఏళ్లుగా పెరటి కంద దుంప సాగు చేస్తున్నానని, ఈ విధంగా పువ్వు ఎపుడూ కనిపించలేదని, ఇది అరుదైన సంఘటనని అర్చకులు రామకృష్ణ తెలిపారు. పలువురు గ్రామస్తులు ఆ పువ్వును ఆసక్తిగా తిలకించారు.

# సిఐటియు నాయకులు అప్పలరాజు కన్నుమూత

- పేదలు, కార్మికుల పక్షాన నిరంతర పోరాటం
- అశ్రు నయనాల నడుమ అంత్యక్రియలు



జి.అప్పలరాజు (ఫైల్‌ఫొటో)



అప్పలరాజు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న సిహెచ్.నర్సింగరావు, కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, తదితరులు

**ప్రజాశక్తి - గోపాలపట్నం :** మోటారు ట్రాన్స్‌పోర్టు యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అప్పలరాజు గుండెపోటుతో మంగళవారం వేకువజామున రాజాంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మృతి చెందారు. ఆయన స్వస్థలం ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ దరి గుళ్లపాడు. సోమవారం ఆయన స్వగ్రామంలోని ఓ వివాహ కార్యక్రమానికి హాజరయ్యారు. మంగళవారం తెల్లవారుజామున గుండెనొప్పి రావడంతో బంధువులు రాజాంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 1991-92 ప్రాంతంలో అప్పలరాజు బతుకుదెరువు కోసం విశాఖకు వచ్చారు. అప్పటి నుంచి కార్మిక ఉద్యమంలో మమేకమయ్యారు. క్రియాశీల కార్యకర్తగా పని చేశారు. సిఐటియు గోపాలపట్నం డివిజన్ కమిటీ సభ్యునిగా, విశాఖ జిల్లా కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా పని చేశారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యలపై కేంద్రీకరించి ఉద్యమించారు. భూపోరాటాలు చేసి పెందుర్తి, గోపాలపట్నం ప్రాంతాల ప్రజల మన్ననలు పొందారు. కార్మికనగర్, గాంధీనగర్, మీనాక్షమ్మనగర్, ఆంజనేయనగర్, జ్యోతినగర్ ప్రాంతాల్లో ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్యలపై పోరాడారు. అప్పలరాజు పార్థివ దేహాన్ని రాజాం నుంచి విశాఖలోని పెందుర్తికి మంగళవారం ఉదయం 9 గంటలకు తీసుకొచ్చారు. ఆయన ఇంటి వద్దే సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన భౌతికకాయం వద్ద పలు పార్టీల, సంఘాల నాయకులు నివాళ్లర్పించారు. అనంతరం అశ్రు నయనాల నడుమ అంతిమయాత్ర సాగింది.

### చిరస్మరణీయుడు అప్పలరాజు

అప్పలరాజు పెందుర్తి ప్రాంతంలో సిపిఎం, సిఐటియు అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు అన్నారు. అప్పలరాజు సంతాప సభను పెందుర్తిలో సిపిఎం జోన్ కార్యదర్శి బి.జగన్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ అప్పలరాజు పేద ప్రజల హక్కుల కోసం, మౌలిక వసతుల కోసం, ఇళ్ల స్థలాల కోసం, ఇళ్ల నిర్మాణం కోసం అలుపెరగని పోరాటాలు నిర్వహించారని కొనియాడారు. పెందుర్తి ప్రాంతంలో ఇతర పార్టీలు జెండాలు కట్టే సాహసం చేయలేని సమయంలో అప్పలరాజు ఆ ప్రాంతంలో ఎర్రజెండాను కట్టి పార్టీ అభివృద్ధికి కృషి చేశాడన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ అప్పలరాజు పేదల కోసం ఓ దివిటీలా పనిచేశారని కొనియాడారు. పార్టీ ఎటువంటి భాధ్యతను అప్పగించినా తూచా తప్పకుండా పాటించేవాడని అన్నారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ అప్పలరాజు మరణం పార్టీకి, కార్మికోద్యమానికి తీరని లోటని అన్నారు. ఆయన భౌతికకాయాన్ని చూసేందుకు వందలాది మంది ప్రజలు తరలివచ్చారంటే ఆయన పనితీరు ఎలాంటిదో ఇట్టే అర్థమవుతుందన్నారు. సంతాప సభలో జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిపిఎం నాయకులు బలివాడ వెంకటరావు, బి.రమణి మాట్లాడారు.

### ఘన నివాళి

అప్పలరాజు భౌతికకాయం వద్ద సిపిఎం, సిపిఐ, సిఐటియు, ప్రజా సంఘాల, టిడిపి, ఇతర రాజకీయ పార్టీల, పౌర సంఘాల నాయకులు ఘన నివాళ్లర్పించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నాయకులు శంకరరావు, విశాఖ జిల్లా నాయకులు బి.పద్మ, పి.వెంకటరెడ్డి, ఎం.సుబ్బారావు, బి.అనంతలక్ష్మి, రామస్వామి, టివి,కృష్ణంరాజు, దళిత నాయకులు డి.రామారావు, సిపిఎం మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, ప్రజా సంఘాల నాయకులు ఎస్.జ్యోతీశ్వరరావు, ఉరుకూటి రాజు, పి.నూకరాజు, పి.రమణ, సిపిఐ రాష్ట్ర నాయకులు జెవి.సత్యనారాయణ మూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు రాంబాబు, శ్రీనివాసరావు, టిడిపి మాజీ కార్పొరేటర్ శానపతి శంకరరావు, పిఒడబ్ల్యు నాయకురాలు వెంకటలక్ష్మి తదితరులు నివాళ్లర్పించిన వారిలో ఉన్నారు.

## విద్యా కుసుమాలకు ఘన సత్కారం



విద్యార్థులకు నగదు ప్రోత్సాహం, జ్ఞాపిక అందజేస్తున్న అనిత

**ప్రజాశక్తి -నక్కపల్లి :** ప్రభుత్వ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని, పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మంగళవారం నక్కపల్లిలో మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద పదో తరగతిలో మంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్యాకుసుమాల పేరిట అభినందన కార్యక్రమం నిర్వహించారు. పాయకరావుపేట నియోజకవర్గంలో 50 ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన 101 మంది విద్యార్థులను ఆహ్వానించి, అభినందించారు. ఒక్కొక్క విద్యార్థికి రూ. 5 వేల నగదు, జ్ఞాపికలను అందజేసి సత్కరించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు.

ఈ సందర్భంగా హోంమంత్రి అనిత మాట్లాడుతూ పాయకరావుపేట నియోజకవర్గంలో 2002లో తాను ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పనిచేశానన్నారు.గ్రామీణ ప్రాంతాల పిల్లలు మట్టిలో మాణిక్యాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో నాణ్యమైన విద్య అందుతున్నప్పటికీ, ప్రైవేటు స్కూల్‌లో చదివించడం కొంతమందికి ఫ్యాషన్ అయిపోయిందన్నారు.ఈ భావన ఉంచి తల్లిదండ్రులు బయటకు రావాలని, సర్కారు బడుల్లో తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలన్నారు. పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధనకు కషి చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఇక ఏటా పాయకరావుపేట నియోజకవర్గంలోవిద్యాకుసుమాల అభినంధన కార్యక్రమం నిర్వహిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో డిఇఒ అప్పారావు నాయుడు, డిప్యూటీ డిఇఒ అప్పారావు, ఎంఇఒలు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నాలుగు వారాలుగా అందని తపాలా సేవలు

**ప్రజాశక్తి-రావికమతం:** మండల కేంద్రంలోని సబ్‌పోస్టాఫీస్‌లో సాంకేతిక సమస్యతో నాలుగు వారాలుగా తపాలా నిలిచిపోవడంతో తపాలా వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. రిజిస్టర్డ్, సాదారణ పోస్టల్ సర్వీసులతో పాటు ఇతర సేవలు కూడా నిలిచిపోయాయి. సబ్‌పోస్టాఫీస్‌లోని కంప్యూటర్స్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో ఈ పరిస్థితి నెలకొందని పోస్టల్ అధికారులు అంటున్నారు. దీంతో తపాలా సేవలు కావాలనుకుంటే ఇటు కొత్తకోట, అటు వడ్డాది, చోడవరం, ప్రాంతాలకు వెళ్ళవలసినటువంటి పరిస్థితి నెలకొంది. ఎటు చూసినా 15 కిలోమీటర్ల పోస్టల్ సేవలకు వెళ్లాల్సిన స్థితిలో వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. నాలుగు వారాలుగా పోస్టల్ సేవలు నిలిచిపోతే, సబ్‌పోస్టాఫీస్‌లో నెలకొన్న సాంకేతిక సమస్య పరిష్కారంపై సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించకపోవడం దారుణమని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం విద్య, ఉద్యోగ సీజన్ కావడంతో సంబంధిత సమాచారం వచ్చిపోయే వీలులేకపోవడంతో నష్టపోయే పరిస్థితి ఉందని నిరుద్యోగులు, విద్యార్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పోస్టల్ ఉన్నతస్థాయి అధికారులు స్పందించి, పోస్టల్ సేవలను పునరుద్ధరించే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

## తెలుగు భాష ఆత్మగౌరవ దినోత్సవంగా ఎన్‌టిఆర్ జయంతిని నిర్వహించాలి



స్పీకర్ అయ్యన్నకు వినతిపత్రం ఇస్తున్న బివి.రామ్

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :** సమాజమే దేవాలయం, ప్రజలే నా దేవుళ్లు నినాదంతో బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అందించిన, సమర్థ వంతమైన పాలనతో తెలుగు జాతి గౌరవాన్ని విశ్వవిఖ్యాతం చేసిన మహానుభావుడు అన్న ఎన్టీరామారావు అని తెలుగు శక్తి అధ్యక్షుడు బీవీ.రామ్ అన్నారు. మంగళవారం స్థానిక స్పీకర్ క్యాంపు కార్యాలయంలో అయ్యన్నపాత్రుడిని కలిసి, అన్న ఎన్టీఆర్ జయంతిని తెలుగుభాషా ఆత్మగౌరవ దినోత్సవంగా నిర్వహించాలని, ఈ మేరకు సిఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి ప్రతిపాదించాలని కోరారు.ఈ మేరకు స్పీకర్ అయ్యన్నకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే గిడుగు వెంకట రామమూర్తి, పింగళి వెంకయ్య అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు, గౌతు లచ్చన్న వర్ధంతి జయంతులను ప్రభుత్వ కార్యక్రమాలు గా చేస్తున్నారని తెలిపారు. దీనిపై స్పందించిన అయ్యన్నపాత్రుడు విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. స్పీకర్‌ను ఎంఎస్. నాయుడు, వి.పూర్ణచంద్రరావు కలిశారు.

## విగ్రహ పున:ప్రతిష్ఠ వేడుకల్లో అయ్యన్న

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :** స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ, యంత్ర పున:ప్రతిష్ఠ వేడుక మంగళవారం ఘనంగా ప్రారంభించారు. ఎన్టీఆర్ మిని స్టేడియంలో ప్రత్యేకంగా యాగశాలలో ప్రారంభ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, పద్మావతి దంపతులు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. .అయ్యప్ప స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నుండి గురువారం వరకు పున:ప్రతిష్ఠ జరగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.